# కర్నూలు | నంద్యాల వార్త

28 మార్చి 2023 | మంగళవారం | పేజీలు 4


## మహిళా సంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యం..

**- 773 సంఘాలకు రూ.4.92 కోట్ల చెక్కును అందజేత : ఎమ్మెల్యే శిల్పా**



**బండిఆత్మకూరు, మార్చి 27, ప్రభాతవార్త:** మండలంలోని పార్నపల్లె గ్రామంలో టిటిడి కళ్యాణమండపంలో మూడవ విడత అసరా వారోత్స వాలు ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. ముందుగా ముఖ్యమంత్రి జగన మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యేతో పాటు మహిళలు క్షీరాభిషేకం చేశారు. మహిళా సంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని 773 సంఘాలకు రూ.4,92,75,491లు అక్కా చెల్లెమ్మలకు చెక్కులు అందజేశారు. ముఖ్యమంత్రి రిలీఫ్‌ఫండ్ చాకలి వెంకటేశ్వర్లుకు రూ.60 వేలు, నర్లా రామచంద్రారెడ్డికి రూ.55 వేల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అందజేస్తు అందరి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఇప్పటికే అమ్మఒడి, వైయస్‌చేయూత, సున్నావడ్డీకే రుణాలు, అసరా వంటి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమం చేపట్టడం ద్వారా మహిళలు అర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. మహిళల అభివృద్ధికి అన్ని రకాలుగా పెద్దపీట వేశారన్నారు. ముఖ్యమంత్రి మహిళా పక్షపాతి అన్నారు. గత పాలకులు మహిళల కోసం సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నట్లు నటించారని వాస్తవంగా కార్యరూపం దాల్చలేదన్నారు. పాదయాత్రలో చేసిన వాగ్దానాలు ఒక్కొక్కటిగా నేరవేర్చుతూ పరిపాలన సాగిస్తున్నారన్నారు. శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, తహా శీల్దార్ ఉమా రాణి, ఎంపిడిఓ వాసుదేవగుప్తా, ఏపీఓ రాజశేఖర్ జడ్పీటిసి రామతులశమ్మ, ఎంపీపీ దేరెడ్డి సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల రమణ, జేసిఎస్ కన్వీనర్ ముడిమేల పుల్లారెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట రామిరెడ్డి, సింగిల్ విండోచైర్మన్ బూరం శివ లింగం, సర్పంచ్ షెక్ షబ్బీర్‌బాష, ఎంపిటిసి శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచ్ రామలింగేశ్వం రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజల చెంతకే వైద్యం..!

**: 16 నూతన 104 వాహనాల ప్రారంభం**

**: సేవలు ప్రారంభించిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం**

**కర్నూలు, మార్చి 27, ప్రభాతవార్త :** ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా ప్రజల చెంతకే వైద్య సేవలు చేరువ చేయడం జరిగిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద ప్రభుత్వం జిల్లాకు మంజూరు చేసిన 16 నూతన 104 వాహనాలను మంత్రి, ఎమ్మెల్యేలు, మేయర్, కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా వైద్య సేవలను అందిస్తూ వైద్య రంగానికి పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో 104 వాహనాల్లో వైద్యులు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి 14 రకాల వైద్య పరీక్షలు, 67 రకాల మందులు అందించడం జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ఆసుపత్రులను నాడు నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టి ఎంతో మందికి వైద్య సేవలు అందించగా, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కి మరింత ప్రాధాన్యత ఇస్తూ, 3255 వ్యాధులకు వైద్యం అందించడం జరుగుతోందన్నారు. జిల్లాలో ఇప్పటి దాకా 25 వాహనాలతో 104 వైద్య సంచార వాహనాల ద్వారా గ్రామాలలో పర్యటిస్తూ వైద్యం అందించడం జరుగుతోందని, ఇంకా ఎక్కువ స్థాయిలో వైద్యాన్ని అందించడానికి గాను ప్రభుత్వం మరో 16 నూతన 104 వాహనాలను మంజూరు చేసిందన్నారు. గ్రామాల్లో ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా అందిస్తున్న వైద్య సేవలు వినియోగించుకోవాలని మంత్రి కోరారు. జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు మాట్లాడుతూ నెలకు రెండు పర్యాయాలు 104 వాహనం ద్వారా ఒక డాక్టర్, సూపర్వైజర్, ఏఎన్ఎం, ఆశా లుసాధారణ ఆరోగ్య సమస్యలు, గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య పరీక్షలు, శిశువులకు, రక్త హీనత ఉన్న వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, కిడ్నీ సమస్య ఉన్న వారికి తదితరులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతోందని, దీర్ఘకాలిక రోగులు, బాలింతలకు, వైయస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేసుకున్నవారికి వారి ఇంటివద్దనే చికిత్సలు అందించడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ప్రారంభ కార్యక్రమం అనంతరం 104 వాహనాల ర్యాలీ రాజ్ విహార్, కొండా రెడ్డి బురుజు, కలెక్టరేట్ మీదుగా తిరిగి ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు చేరుకున్నాయి..కార్యక్రమంలో ఎమ్మెల్సీ డా.మధుసూధన్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, కర్నూలు మున్సిపల్ కమీషనర్ భార్గవ్ తేజ, ఆర్డీఓ హరిప్రసాద్, డిఎంహెచ్ఓ రామ గిడ్డయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అంతా మాఇష్టం..!

### సచివాలయ ఉద్యోగులు.. వస్తారు.. వెళ్తారు..!




*- వేలిముద్రలు వేశామా, ఇంటికి వెళ్లామా?*

*- సాయంకాలం వచ్చి వేలిముద్రలు వేసి ఇంటికి పోయామా?*

*- నిలిచిపోయిన అధార్ సేవలు.. ఇబ్బందులు పడుతున్న ప్రజలు*

**మహానంది సచివాలయంలో విధులు నిర్వహించే సచివాలయానికి వచ్చామా, ఇంటికి పోయామా అంటూ ప్రవర్తించడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ప్రజలకు చేరువై మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారు. వాస్తవ పరిస్థితుల్లో కొంత మంది అధికారుల తీరుపట్ల ఆ వ్యవస్థకు చెడ్డపేరు తీసుకువస్తుంది. ప్రతినిత్యం సచివాలయ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తు గ్రామాభివృద్ధికి తోడ్పాల్సిన అధికారులు వారి సొంతపనులకు కేటాయించిన సమయం సచివాలయాలకే కేటాయించడం లేదని ప్రజలు అరోపిస్తున్నారు.**

*మహానంది, ప్రభాతవార్త:*

సచివాలయానికి వచ్చే సిబ్బంది 10.30 గంటలకు వస్తారు. ఆ తరువాత సచివాలయంలో ఏవరు కనిపించరు. వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చే ప్రజలకు అధికారులు అందుబాటులో లేక వెనుతిరగాల్సిన పరిస్థితి నెలకొంది. సచివాలయ సిబ్బంది ఏవరికి వారే యమునాతీరే అన్నట్లు వ్యవహారిస్తున్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు అధికారులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు ఇళ్ళకు వెళ్లిపోతారో తెలియని అయోమయ పరిస్థితుల్లో ప్రజలున్నారు. సచివాలయ సిబ్బంది సుమారు 11 మంది వరకు ఉంటారు. అయితే విధుల్లో మాత్రము ఒకరిద్దరు మాత్రమే కార్యాలయంలో కలిపిస్తారు. మిగతా సిబ్బంది ఎక్కడికి

•వివరాలు 2లో



## ఫిర్యాదులు రిపిట్ కాకూడదు

**- పోలీస్ స్పందనకు 120 ఫిర్యాదులు : జిల్లా ఎస్పీ**

**నంద్యాల క్రైం, మార్చి 27, ప్రభాతవార్త:** పోలీస్ స్పందనకు వచ్చే ఫిర్యాదులు మరోసారి రిపిట్ కాకూడదని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం జరిగిన స్పందనకు 120 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి అనేక ఫిర్యాదులు ఎస్పీకి చేశారు. ఫిర్యాదులను సంబంధింత అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. తక్షణమే ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించాలని అదేశించారు. చట్టపరిధిలోని సమస్యలను తక్షణ పరిష్కారం చూపాలని అదేశించారు. వీధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. స్పందనలో సివిల్ పంచాయితీలు, అన్నదమ్ముల అస్తితగాదాలు, కుటుంబ సభ్యుల కలహాలు, అత్తారింటి వేదింపులున్నాయి. ఫిర్యాదుదారుల సమస్యలపై అధికారులు తీసుకున్న చర్యలపై అధికారులు ఎప్పటికప్పుడు జిల్లా పోలీస్ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి సోమవారం జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లో, సిర్కిల్ అఫీసు, డీఎస్పీ అఫీసుల్లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెఇపారు. జిల్లా అడిషనల్ ఎస్పీ రమణ, ఎస్పీ, ఎస్టీ సెల్ డిఎస్పీ రామాంజినాయక్, సిఐలు పాల్గొన్నారు.

## సమస్యలను నాణ్యతో పరిష్కరించండి

**- ఓటర్ల జాబితాను అధార్‌తో అనుసంధానం : జిల్లా కలెక్టరు**



**నంద్యాల, మార్చి 27, ప్రభాతవార్త:** ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో స్వీకరించిన ధరఖాస్తులను నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమాన్ని జేసి టి నిశాంతి, డిఆర్వో పుల్లయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ స్పందన అర్జీలు ఏఏ సచివాలయాల నుంచి అర్జీలు అధికంగా వచ్చాయో తహాశీల్దార్లు నివేదికలు ఇవ్వాలని అదేశించారు. ఓటర్ల జాబితా అధార్ అనుసంధానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 2,51,245 మంది ఓటర్లు ఫాం-6బి పెండింగ్‌లో ఉన్నాయని ఈనెల 30లోపు పూర్తిచేయాలని అదేశించారు. నాడు నేడు కింద చేపట్టిన స్కూల్స్‌ను ర్యాండమ్‌గా చెక్‌చేసి వచ్చేనెల 6లోగ నివేదికలు అందిజేయాలన్నారు. ఈనెల 29న కర్నూలు జడ్పీ సమావేశంలో తాగునీరు. భూగర్బ జలాలు, హౌసింగ్, పశుసంవర్ధక తదితర అంశాలపై సమావేశం ఉంటుందని సంబంధిత అధికారులు నోట్స్ తయారు చేసుకోవాలని తెలిపారు. కోర్టు కేసులకు సంబంధించి ఎప్పటికప్పుడు కౌంటర్ ఫైల్ దాఖలు చేయాలని అధికారులను అదేశించారు. వార్త పత్రికల్లో ప్రచురితమైన వ్యతిరేక వార్తల క్లిప్పింగ్‌లపై వెంటనే స్పందించి రిజాయిండర్లు ఇవ్వాలని అధికారులను అదేశించారు. రుద్రవరం మండలం నివాసి బాష తన తండ్రి దస్తగిరికి 293/ఏలో 25 సెంట్లు, 290/ఎలో 10 సెంట్లు, 292/ఏ 10 సెంట్లు, 291/ఏలో 51 సెంట్లు భూమిని వీలునామ రాయించారని పాస్‌పుస్తకం, అడంగల్ చేర్చాలని కోరారు. పగిద్యాల మండలం బీరవోలు గ్రామంలో కెసికెనాల్ పక్కన బ్రిడ్జి సమీపంలో కల్లుదుకాణం ఉందని దుకాణానికి వచ్చేవారు కల్లుతాగి అసభ్యంగా ప్రవర్తిస్తు కుటుంబాలను ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. ఇంకా జిల్లాల నుంచి 175 మంది అర్జీదారులు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

## ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోండి - జిల్లా కలెక్టర్



**కర్నూలు, మార్చి 27, ప్రభాతవార్త :** ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వర రావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో హీట్ వేవ్ ప్రీపెర్డ్నెస్ అంశం పై జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ రిపోర్టుల ప్రకారం గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది ఎండలు రెండు మూడు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఏడాది ఫసిఫిక్ మహాసముద్రంలో కాలానుగుణంగా వచ్చే మార్పుల కారణంగా ఎల్‌నినో పరిస్థితి ఏర్పడుతుందని అందువల్ల వేసవికాలం మరింత వేడిగా మారుతుందని అన్నారు. ప్రకృతిలో కాలానుగుణంగా వస్తున్న మార్పులను అపలేము కాబట్టి మనం దరమూ కలిసి శాఖల వారీగా ఎవ్వరూ చేయాల్సిన పనులు వారు బాధ్యతతో చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా స్థాయిలో టోల్ ఫ్రీ నెంబర్ డిస్ల్పే చేస్తూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని డిఆర్వో ను ఆదేశించారు.. జిల్లా మరియు మండల స్థాయిలో హీట్ వేవ్ కి సంబంధించిన యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అదే విధంగా స్వచ్ఛంధ సంస్థల వారితో కో ఆర్డినేట్ చేసుకొని చలివేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పిహెచ్ సి,సిహెచ్ సి లకు హీట్ వేవ్ కి సంబంధించిన గైడ్లెన్స్ జారీ చేయాలని, వడదెబ్బకి గురైనపుడు ఇవ్వాల్సిన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు , అంబులెన్స్ లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిఎమ్ హెచ్ఓ డాక్టర్ రామ గిడ్డయ్య ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సిగ్నల్స్ దగ్గర విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బందికి షెడ్లు మరియు త్రాగునీరు ఏర్పాటు దానితో పాటు కూల్ జాకెట్స్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులకు త్రాగునీరు ఏర్పాటు చేయడంతో పాటు 10 వ తరగతి పరీక్షల సమయంలో సంబంధిత పరీక్ష కేంద్రాలలో త్రాగునీరు మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత డిఈఓ రంగా రెడ్డి ని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు కాబట్టి త్రాగునీరు అందుబాటులో ఉండే విధంగా ప్రతి కార్యాలయ అధికారి చూసుకోవాలని అదే విధంగా ప్రతి సచివాలయంలో త్రాగునీరు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తహాశీల్దార్ లను మరియు ఎంపీడీవో లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనుకోని అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు మంటలు అర్పటానికి ఫైర్ వెహికల్స్ కండిషన్ చెక్ చేసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వర రావు, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ అనుపమ, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో 30 మంది విద్యార్థులు డీబార్

**-1307 మంది విద్యార్థులు గైర్హాజరు**

**నంద్యాల విద్య, మార్చి 27, ప్రభాతవార్త:** ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఇంటర్ థియరీ పబ్లిక్ పరీక్షలు 123 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. సోమవారం జరిగిన రెండవ సంవత్సరం ఇంటర్ పరీక్షల్లో 30 మంది విద్యార్థులు మాస్ కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడగా వారిని డీబార్‌చేసినట్లు ఆర్ఐఓ గురువయ్యశెట్టి తెలిపారు. జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 34,463 మంది విద్యార్థులు పరీక్షకు ధరఖాస్తుచేసుకోగా అందులో 33,156 మంది విద్యార్థులు హాజరుకాగ 1307 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈరోజు జరిగిన పరీక్షకు మూడవ సెట్ నంబరును కేటాయించారు. అస్పరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 6, ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇద్దరు, కోవెలకుంట్ల సోషల్ వేల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 4, ఏపీ మోడల్‌స్కూల్స్ జూనియర్ కళాశాలలో డోన్‌లో 6, బేతంచెర్లలో 6, కృష్ణ గిరిలో 3, పాణ్యం సిమెంటు జూనియర్ కళాశాల బేతంచెర్ల లో 3 విద్యార్థులు మాస్‌కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడగా డీబార్ చేశారు. ఆర్ఐఓ 4, డివిఇఓలు 10, హెచ్‌పిసి 6, డిఇసి 6, ఫ్లయింగ్‌స్క్వాడ్స్ 26, సిట్టింగ్‌స్క్వాడ్స్ 12, కస్టోడియన్ అదికారులు 29 పరీక్షా కేంద్రాలను అకస్మికంగా తనిఖీలు చేశారు. ప్రతిరోజు జిల్లాలో మాల్‌ప్రాక్టిస్‌కు పాల్పడుతున్న విద్యార్థులు వారిని కట్టడి చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక రెండురోజుల్లో పరీక్షలు ముగియనున్నాయి.

## పిల్లలు ఈతకు వేలుతున్నారా జాగ్రత్తా....

**- ప్రతి ఏడాది ఈత ప్రమాదాలే**

**గోనెగండ్ల మార్చి 27 ప్రభాతవార్త :** వేసివి కాలం వచ్చేందంటే పాఠశాలలకు సెలవులు వస్తాయి. కొత్త ఊర్లకు వెళతారు. ఇక వారి సరదానే సరద, అయితే ఈతకు వెళ్లేటప్పుడు మాత్రం తల్లిదండ్రులు కొంత జాగ్రత్త తీసుకోవాల్సి ఉంటుంది. బావులు, కుంటలు, చెరువుల్లో ఈతకు వెళ్లే ముందు పిల్లల పట్ల వారి తల్లిదండ్రులు ఒకటికి రెండు మార్లు అలోచించి పపాల్సి ఉంటుంది. ఈత అడే సమయంలో వారి ఆనందానికి హద్దు ఉండదు, బావి గట్టు మీద నుండి దూకడం వల్ల బావిలోని పూడికలో కూరుకొని పోయే ప్రమాదాలు ఉన్నాయి. చేరువులు, కుంటల పరస్థితి కూడ ఇంతే ప్రతి ఏడాది గోనెగండ్ల మండలంలో ఈత ప్రమాదాలు జరుగుతూ నే ఉన్నాయి. గత ఏడాది ఐరన్‌బండ గ్రామానికి చెందిన 7వ తరగతి చదువుతున్న బాషా అనే విద్యార్థి ఎల్లెల్సీ కాలువలో ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. రెండేళ్ల క్రితం గోనెగండ్ల మండలం నెరుడుప్పల గ్రామానికి చెందిన మల్లికార్జున, ప్రకాష్‌లు ఇద్దరు విద్యార్థులు ఈతకు వెళ్లి గాజులదిన్నె ప్రాజెక్టులోని గుంతలో పడి మృతి చెందారు. ఈ లాంటి సంఘటనలు మండలంలో ప్రతి ఏడాది జరుగుతూనే ఉన్నాయి. కావున వేసవిలో ఈత అడే పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి.



## దొంగలు.. దొరికారు..!

**తుగ్గలి, మార్చి 27, ప్రభాతవార్త :** గోవులు, పందులు, విద్యుత్ వైర్లు దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని తుగ్గలిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక ఎద్దులదొడ్డి గ్రామానికి వెళ్లే మలుపు వద్ద సాయంత్రం పట్టుకోవడం జరిగిందని తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం పోతురాయి గ్రామానికి చెందిన సాకె బాలన్న, అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన ఎరుకలి మల్లికార్జున, అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం పోరాల గ్రామానికి చెందిన ఎరుకలి చిన్న గంగన్న, అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ముంటీమడుగు గ్రామానికి చెందిన బాలాజీ సుధాకర్‌లు పలుచోట్ల దొంగతనానికి పాల్పడిన ముద్దాయిలుగా అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. వీరి వద్ద నుండి గోవుల దొంగతనానికి పాల్పడిన కేసులో రూ.50వేలు, విద్యుత్ వైర్ల దొంగతనం కేసులో రూ.1లక్ష40వేలు నగదును, ఏపి39యుబి 6791అశోక్ లైల్యాండ్ గూడ్స్ క్యారియర్ వాహనంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈకేసులను చేధించడంలో ఎంతో చాకచక్యంగా వ్యవహరించి దొంగలను పట్టుకున్న పోలీసులు ఎస్ షబ్బీర్ భాష, ఈ వినోద్ లను జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, ఎస్ఐ మల్లికార్జునలు అభినందించారు. స్టేషన్‌కి ఇచ్చిన కొంత రివార్డు నగదును తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున కానిస్టేబుల్ షబ్బీర్ భాష, వినోద్‌ల చేతికి అందించి శాలువాలతో సత్కరించారు. ఇందులో ఏఎస్ఐలు నరసప్ప, మాధవస్వామి, కానిస్టేబుల్ నారాయణస్వామి, హోంగార్డు రంగస్వామిలు వున్నారు.



## ప్రజల ఆరోగ్యభద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి



**నంద్యాల హాస్పటల్, మార్చి 27, ప్రభాతవార్త:** ప్రజలకు మెరుగైన వైద్యం అందించి వారి ఆరోగ్యభద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోం రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ జిల్లాకు కొత్తగా మంజూరైన ఐదు 104 వాహనాలను జాయింట్ కలెక్టరు టి నిశాంతి ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టరు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ జిల్లాల్లో మండలానికి ఒకటి చొప్పున 25 మండలాలకు 104 వాహనాలు అందుబాటులో ఉన్నాయని వీటికి అదనంగా మరో ఐదు కొత్త వాహనాలు మంజూరు చేసిందని తెలిపారు. ప్రతి 104 వాహనం ఒక సచివాలయాన్ని రెండుసార్లు సందర్శించి వైద్య సేవలు అందిస్తారని ఈవాహనంలో వైద్యులు, ఆరోగ్యసిబ్బంది, డిఇఓ ఉంటారని తెలిపారు. ఉదయం వేళలో వచ్చిన రోగులకు బిపీ, షుగర్ వంటి వైద్యపరీక్షలతో పాటు ఓపిని చూసి తగిన మందులు అందిస్తారని వివరించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాష, డిఎంఅండ్ హెచ్ఓ వెంకటరమణ, డిఐఓ డా.ప్రభావతి, 104 జిల్లా నోడల్ అఫీసర్ డా.జగదీష్ చంద్రారెడ్డి, జిల్లా మేనేజర్ మహమ్మద్ రఫీ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## డిఇఓ ఉత్తర్వులు.. రాష్ట్రవ్యాప్త నిరసనలు

**- వార్తకు స్పందన**

**నంద్యాల విద్య, మార్చి 27, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా విద్యాశాఖాధికారి ఎం అనురాద ఇచ్చిన ఉత్తర్వులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం కావడంతో అనే శీర్షికతో సోమవారం వార్త ప్రచురణ అయింది. వార్తకు స్పందన లభించింది. జిల్లా విద్యాశాఖాధికారి కంప్యూటర్ అపరేటర్‌చేసిన పొరపాటు ఈవిధంగా జరిగిందని వివరణ ఇచ్చారు. గత ఏడాది 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడ్డారని జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసి క్రిమినల్‌కేసులు నమోదుచేశారు. ఈఏడది పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యే నాటికి ప్రతిరోజు ఆ ఉపాధ్యాయులు పోలీసు స్టేషన్‌లో ఉదయం 9 నుంచి 1 గంట వరకు కూర్చోవాలన్న ఉత్తర్వులను జారీచేశారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ ఉపాధ్యాయులను పోలీస్‌స్టేషన్‌లో కాకుండా తహాశీల్దార్ కార్యాలయంలో కూర్చోబెట్టాలని ఉత్తర్వులు ఇస్తామని అదేశాలు జారీచేస్తామని తెలిపారు.

# రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోం

### - సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు



**గడివేముల, మార్చి27, ప్రభాతవార్త ;** రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమని, అనుభవంలో ఉన్న రైతుల భూములు లాక్కుంటే ఉద్యమం తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగానా యుడు అధికారులను, నాయకులను హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని కొర్రపోలూరు గ్రామంలోని ఎస్ఆర్‌బీసీ కాలువ పక్కన ఉన్న సర్వేనంబర్ 11లో 22కేవీ హైపవర్ సబ్‌స్టేషన్ నిర్మించాలన్న పేరుతో బలవం తంగా అనుభవంలో ఉన్న రైతులను కాదని, నాయ కుల అధికారుల అండదండలతో భూములను ఆన్‌లైన్ లో ఎక్కించుకున్నారని, అనుభవంలో ఉన్న రైతులను పోలీసులతో బెదిరించారన్నారు. సాగుకు అనుకూలంగా ఉన్న భూముల్లో కాకుండా వేరొకచోట సబ్ స్టేషన్ వేయాలన్నారు. పేద రైతులకు చెందాల్సిన భూములు అధికార వైసీపీ నాయకుల చేతుల్లో ఉంటే రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నార న్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. ఈ విషయాన్ని సీపీఐ జాతీయ, రాష్ట్ర నాయకులకు తెలియజేసి ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గసభ్యులు ప్రసాద్, ప్రతాప్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అహ్మద్‌హుసేన్, మండల నాయకులు రాంప్రసాద్, రసూల్, సంజన్న, నబిషా బాధితా రైతులు పాల్గొన్నారు.

## యువత జనసేన పార్టీ సిద్దాంతాలకు అకర్శితులు



**కర్నూలు విద్య, మార్చి 27, ప్రభాతవార్త:** ఉమ్మడి కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గం కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 28వ వార్డు పందిపాడు గ్రామం పూల శంకరయ్య అధ్వ ర్యంలో 30 మంది యువత జనసేన పార్టీ సిద్దాంతాలకు అకరి ్శతులై జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అశయాలు నచ్చి నియోజకవర్గ ఇంచార్జీ చింతా సురేష్‌బాబు సమక్షంలో స్థానిక బిర్లా కాంపౌండ్ జనసేన పార్టీ కారా ్యలయంలో జనసేన పార్టీలో చేరారు. ఈకార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గ నాయకులు సుధాకర్,బోయ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## నందికొట్కూరులో ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



**నందికొట్కూరు,మార్చి 27,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఎస్‌సెస్సీ మరియు ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల కేంద్రాన్ని నందికొట్కూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేయాలని ఏఐఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనువాసులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఎస్.ఎస్.సి. ఇంటర్మీడియట్ స్టడి కేంద్రాలు ఉన్నాయని వాటిలో అడ్మిషన్స్ దాదాపు 200 వరకు ఉన్నాయని 2016 నుండి ఇక్కడే పరీక్షలు రాసేవారని అయితే ఇటీవలే పరీక్ష కేంద్రాన్ని కర్నూలు జిల్లాకు బదలాయించారని దీంతో పరీక్షలకు వెళ్ళేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీనిపై నిర్లక్ష్యం వహించిన డిసి లక్ష్మీనారాయణపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. డిసి లక్ష్మినారాయణకు అనేక సార్లు ఇక్కడ పరీక్ష కేంద్రం పెట్టాలని కోరిన ఆయన పట్టించుకోవడంలేదన్నారు. కర్నూలు, ఆత్మకూరు కేంద్రాలకు వెళ్ళి పరీక్షలు రాయాలంటే విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉందని ఇప్పటికైన సంభంధిత అధికారులు స్పందించి నందికొట్కూరులో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి మహానంది, వీరేంద్ర, వినోదు, దినేష్‌లు పాల్గొన్నారు.

## బనగానపల్లె గ్రామ పంచాయతీకి వేలాల ద్వారా రూ.22.69లక్షల ఆదాయం



**బనగానపల్లెరూరల్, మార్చి27,ప్రభాతవార్త:** బనగానపల్లె గ్రామ పంచాయతీకి సంబంధించి 2023-24 సంవత్సరానికి గాను సోమవారం పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం నందు ఎంపిడివో ఏ.శివరామయ్య అధ్యక్షతన,సర ్పంచ్ ఈసారి ఎల్లమ్మ,పంచాయతీ ఈవో ఖలీల్ బాషాల ఆధ్వర్యంలో బహిరంగ వేలాలు నిర్వహించారు.పంచాయతీ పరిధిలోని సంత మార్కెట్,నిలుపబడిన వాహనాల స్టాండ్,జంతువధశాలకు వేలాలు నిర్వహించగా సంతమార్కెట్‌ను రూ.11,76,000లకు,నిలుపబడిన వాహనాల స్టాండ్‌ను రూ.10,11,000లకు,జంతువధశాలను రూ.82,000వేలకు షేక్ మహబూబ్‌షా దక్కించుకున్నట్లు వారు తెలిపారు.వీటికి సంబంధించిన రుసుము వసూలు 1-4-2023 నుండి 31-3-2024 వరకు రుసుము వసూళ్ల చేసుకునే హక్కును పాటదారుడుకి ఉంటుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.బాబుసాహెబ్,జూనియర్ అసిస్టెంట్లు ఎం.ఈశ్వరయ్య, ఎం.సుభాషిణి, పంచాయతీ సిబ్బంది మరియు పాటదారులు పాల్గొన్నారు.

## చల్లా నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన చల్లా శ్రీలక్ష్మి

### - చల్లా ఆశయాలకు కృషి చేస్తా : చల్లా శ్రీలక్ష్మి



**అవుకు, మార్చి27,ప్రభాతవార్త:** అవుకు పట్టణంలో నియోజకవర్గస్థాయి చల్లా పార్టీ కార్యాలయాన్ని అవుకు జెడ్పిటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా చల్లా శ్రీలక్ష్మి మాట్లాడుతూ దివంగతనేత చల్లా రామకృష్ణారెడ్డి,చల్లా భగీరథరెడ్డిల ఆశయాలతో చల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగిందని ఆమె తెలిపారు.చల్లా ఆశయాలకు కృషి చేస్తానని ఆమె తెలియజేశారు.ప్రజలందరికి అందుబాటులో ఉంటానని ఆమె తెలిపారు.చల్లా పార్టీ కార్యాలయాన్ని చల్లా వారసులు చల్లా రాజ్యాభిషేక్‌రెడ్డి,జూనియర్ చల్లా రామకృష్ణారెడ్డిలు రిబ్బన్ కట్‌చేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.అదే విధంగా వేదపండితులతో ఆశీర్వదం తీసుకున్నారు.నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ కులాలకు,మతాలకు అతీతంగా గొడవలకు తావులేకుండా అవుకు ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆమె తెలియజేశారు.అదే విధంగా ప్రజలకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా చల్లా శ్రీలక్ష్మి దృష్టికి తీసుకువస్తే ఆమె పరిష్కరిస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చల్లా సాయిచరణ్‌రెడ్డి,చల్లా సాయి చైతన్యరెడ్డి,చల్లా విక్రాంత్‌రెడ్డి,అభిమానులు,వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు,ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## చిరంజీవి యువత రక్తదాన శిబిరం



**కర్నూలు విద్య, మార్చి 27, ప్రభాతవార్త:** రక్తదాన స్ఫూర్తిదాత, అపద్భాంధవుడు పద్మభూషన్ మెగాస్టార్ డాక్టరు కొణిదేల చిరంజీవి తనయుడు మెగా పవర్ స్టార్ రాంచరణ్ జన్మదినం సందర్భంగా కర్నూలు జిల్లా యువత అధ్యక్షులు చింతా సురేష్ బాబు అదేశాల మేరకు కర్నూలు నగరంలోని రెడ్ క్లాస్ బ్లడ్ బ్యాంక్‌లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా మెగా అభిమానులు రక్తదానం చేయడం జరిగింది. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ఛైర్మన్ డా.గోవిందరెడ్డి పాల్గొన్నారు. అనంతరం రెడ్ బ్లడ్ బ్యాంక్ ప్రాంగణంలో కేక్ కట్‌చేసి గ్లోబల్‌స్టార్ రాంచరణ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## వేలాల్లోపెరిగిన పంచాయతీ ఆదాయం

**వెలుగోడు,మార్చి27,ప్రభాతవార్త :** వెలుగోడు మేజర్‌పంచాయతికార్యాలయంలో సర్పంచ్ వేల్పుల జయపాల్ అధ్యక్షతన నిర్వహించిన పంచాయతి వేలంపాటలు జరిగాయి.2023-2024 సంవత్సరానికి సంబంధించి వారపుసంత రూ.4.28లక్షలకు తెలుగుశివయ్య దక్కించుకోగా,బస్టాండ్ వద్ద రూ.4.19 లక్షలకు సోహేల్ దక్కించుకోగా,జంతువదశాలను సలీముద్దీన్ దక్కించుకొన్నట్లు ఈవోఆర్డీ వెంకటరెడ్డి,పంచాయతి కార్యదర్శిహరిలీల తెలిపారు.

## ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులు

**మంత్రాలయం, మార్చి 27,ప్రభాతవార్త :** మండల పరిధిలోని మాధవరం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధ్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాలకు ఎంపికయినట్లు హెచ్ఎం లతీఫ్ సోమవారం విలేకరులకు తెలిపారు.8వ తరగతి చదువుతున్న ప్రత్యూష,హర్షితరెడ్డి,మాబుభాష అనే విద్యార్థులు ఎంపికైనట్లు వారు తెలిపారు.అదేవిధంగా మంత్రాలయం ఉన్నత పాఠశాలలో భానుమతి,వైష్ణవి,కీర్తి,భార్గవి,సుధీర్ అనే విద్యార్థులు కూడా ఉపకార వేతనాలకు ఎంపికయినట్లు హెచ్ఎం అంపయ్య తెలిపారు.ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.ఈకార్యక్రమంలో పిఈటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పశువుకు గాలికుంటు టీకాను వేయించాలి

**గోనెగండ్ల మార్చి 27 ప్రభాతవార్త :** ప్రతి పశువుకు గాలి కుంటు వ్యాధి రాకుండా ముందు జా గ్రత్తగా పశువుల యాజమానులు తమ పశువులకు గాలికుంటు టీకాలను వేయించాలని పశువైద్యాధికారి మహమ్మద్ ఆలీ కోరారు.సోమవారం ఆయన మాట్లాడుతూ గత నెలలో గాలికుంటు వ్యాధి కొన్ని పశువులకు సోకడంతో ముందు జాగ్రత్త చర్యగా మండలంలోని అన్ని గ్రామాలలోని పశువులకు టీకా వేశామని తెలిపారు.అయితే ఎవరి పశువులకైన వేయని పక్షంలో ఈనెల 31వ తేదీలోపు సమీప పశువైద్య కేంద్రం వద్ద టీకా వేయించుకోవాలని ఆయన కోరారు.

## గ్రామ సచివాలయ ఆర్థిక వనరుల పెంపుపై శిక్షణ

**కోడుమూరు,మార్చి 27, ప్రభాతవార్త :** కర్నూలు డివిజన్‌లోని ఆయా గ్రామాల సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు గ్రామ పంచాయతీల ఆర్థిక వనరుల పెంపుపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని కోడుమూరు మండలం లద్దగిరి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈనెల 24వ తేది నుంచి 29వ తేది వరకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు లద్దగిరి గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయా గ్రామాలలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులు,ఇంజనీర్లు,హార్టికల్చర్ అసిస్టెంట్లు,వెటర్నరీ అసిస్టెంట్లు,క్లాప్ మిత్రాలు,షెడ్ వాచ్మెన్‌లకు శిక్షణలు ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో గ్రామ పంచాయతీలు పరిశుభ్రంగా,ఆరోగ్యకరంగా,ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ శిక్షణా తరగతులు ముగిసిన తరువాత ఆయా గ్రామ సచివాలయాలలో పని చేసే ఉద్యోగులు అంతా ప్రతి రోజు గ్రామాలలో ఇంటింటి నుంచి తడిపొడి చెత్తను సేకరించడం, రోడ్ల వెంట ఉన్న చెత్తను వేరు చేసి ఎస్‌డబ్ల్యుపిసి షెడ్డుకు తరలించడం, రైతుల వద్ద నుంచి పేడను సేకరించడం,తడి చెత్త ద్వారా వర్మికంపోస్టు ఎరువును తయారు చేయడం ఆ తరువాత పొడిచెత్తను అమ్మి ఆదాయం సమకూర్చాల్సి ఉంటుంది. గృహ వ్యర్థాల నిర్వహణ, పశువ్యర్థాల దహన సంస్కార నిర్వహణ గురించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఇవోఆర్డీ నాగమ్మ పాల్గొన్నారు.

## అంతా మాఇష్టం..!

**తరువాయి..** అర్థ ్ధం కావడం లేదని ప్రజలు అరోపిస్తున్నారు. ఇటీవల సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ మెటర్నటి సెలవుపై వెళ్లడంతో క్యాస్ట, ఇన్‌కం, అధార్‌ఖ సేవలు నిలిచిపోయాయి. ఆమెస్థానంలో మరొకరిని నిర్ణయించకుండా ప్రజలకు సచివాలయం నుంచి అందించాల్సిన సేవలు నిలిచిపోయినట్లు అయింది. సోమవారం సచివాలయ కార్యాలయంలో కేవలం ఒకరిద్దరు మాత్రమే కనిపించారు. ప్రతిరోజు స్పందన కార్యక్రమం నిర్వహించాల్సిన అధికారులు గ్రామాల్లో ఏఏ సమస్యలు నెలకొన్నాయి. వాటి పరిష్కార దిశగా అడుగులు వేయాల్సిన అధికారులు స్పందన కార్య క్రమాన్ని విస్మరించారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయంపై ఎంపిడిఓ శివనాగజ్యోతిని వివరణ కోరగా విధుల పట్ల అలసత్వం కానీ, సమయానికి హాజరుకాకపోతే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అధార్ సేవలకు సంబంధించి త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## వలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

**గోనెగండ్ల మార్చి 27 ప్రభాతవార్త :** గోనెగండ్ల మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు సోమవారం ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్,ఈవోఆర్డీ నాగేష్ ఇంటర్వ్యూలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ బైలుప్పల1,గోనెగండ్లలో 2, హెచ్ కైరవాడిలో 1,కులుమాలలో 1,పెద్దనేలటూరులో 2 వలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.ఈ పోస్టులకు ఆయా గ్రామాలను నుంచి దాదాపు 23 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు.ఎంపికైన వారికి త్వరలో సమాచారం అందజేస్తామని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

## 29న పంచాయతీ సంత మార్కెట్ వేలంపాట

**మద్దికెర,మార్చి 27,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మద్దికెరలో వివిధ మార్కెట్లకు వేలంపాట నిర్వహణ కార్యక్రమాన్ని శనివారం 25న నిర్వహించాల్సి ఉండగా వాయిదా పడడంతో ఈ నెల 29న బుధవారం నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్‌డి మద్దిలేటి స్వామి తెలిపారు. కావున పాటదారులందరు ఇచ్చిన సమయంకు హాజరు కావాలన్నారు.

## కార్యదర్శిపై వచ్చిన ఫిర్యాదులు అవాస్తవం

**ఆలూరు,మార్చి 27,ప్రభాతవార్త :** ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిపై వచ్చిన ఫిర్యాదులు అవాస్తవమని వార్డుమెంబర్స్ గౌడప్ప,వరుణ్‌లు అన్నారు. సోమవారం ఆలూరు పంచాయతీ కార్యాలయంలో ఈఓపిఆర్‌డి ప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్,కార్యదర్శి మధ్య తలెత్తిన వివాదంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈఓపిఆర్‌డి విచారణ చేపట్టారు. వార్డుమెంబర్స్ గౌడప్ప,వరుణ్,జయశీలమ్మ,శ్రీనివాసుతో పాటు మరికొందరు వార్డుమెంబర్లు విచారణ అధికారికి రాతపూర్వకంగా రాసి ఈఓపిఆర్‌డికి అందచేశారు.

## దళితులపై కపట ప్రేమ చూపుతున్న వైసిపి ప్రభుత్వం



**కర్నూలు రూరల్,మార్చి 27,ప్రభాతవార్త :** రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం దళితులపై కపట ప్రేమ చూపుతుందని కోడుమూరు నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ మీసాల ప్రేమ్‌కుమార్,ఎస్‌సి మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగార్జునలు మండిపడ్డారు. బిజెపి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దళితులకు వ్యతిరేకంగా దళిత రిజర్వేషన్లకు వ్యతిరేకంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని దిక్కరించి దళిత క్రిస్టియన్లను బిసి సిఈలో కాకుండ ఎస్‌సిలో చేర్చే విధంగా అసెంబ్లీలో తీర్మాణం చేయడం సరైంది కాదన్నారు. దళితులకు అన్యాయం జరుగకుండ దళిత వర్గాలను కాపాడాలన్నారు. దళితులను అనేక వర్గాలుగా విభజించి మాల,మాదిగ,రెల్లి కార్పొరేషన్లు విభజించి దళితుల మధ్య చిచ్చు పెడుతూ ఇప్పుడు కొత్తగా దళితులు దళిత క్రిస్టియన్లుగా విభజించి కొత్త చిచ్చుకు తెరలేపిందన్నారు. తక్షణమే ఈ ప్రభుత్వం దిగిపోవాలన్నారు. ఈ విషయమై గవర్నర్‌కు విన్నవించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రామకృష్ణ, జిల్లా కార్యదర్శి సూర్య,గూడూరు మండల ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, కార్యదర్శి ప్రసాద్,కర్నూలు రూరల్ మండల ప్రధాన కార్యదర్శి సద్దల మధు కిషోర్,గూడూరు మండల అధ్యక్షుడు బట్టు రాజశేఖర్,మధు,ఓబిసి మోర్చ ప్రధాన కార్యదర్శి యమలీష్,ఎస్‌సి మోర్చ అధ్యక్షులు శంకర్,ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్,త్రివిక్రమ్‌రావు, సుదర్శన్,ప్రశాంత్ తదితరులున్నారు.

## విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ ఎంతో అవసరం

**హొళగుంద,మార్చి 27,ప్రభాతవార్త :** విద్యార్థులకు చిన్న వయసు నుండే విద్యతో పాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని కర్నూలు సమగ్ర శిక్ష అభియాన్ జిసిడిఓ సునీత విద్యార్థులకు సూచించారు. సోమవారం హొళగుందలో స్థానిక సీజనల్ హాస్టల్‌ను ఆమె పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి సైన్స్ సబ్జెక్టులో విద్యార్థుల ప్రతిభను గుర్తించారు. ఇవే తెలివితేటలు భవిష్యత్తులో కొనసాగించి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకొచ్చి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థి దశ చాలా గొప్పదని ఇప్పుడు మన అడుగులు మంచి ఆలోచనతో కూడుకుని ఉండాలన్నారు. అనంతరం మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రికార్డులు పరిశీలించి,వంటశాలలో విద్యార్థుల కోసం తయారు చేసిపెట్టిన రాత్రి భోజనం అన్నం,పుప్పు,రసం,మజ్జిగను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జిసిడిఓ వేదావతి,ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఫౌండర్ ప్రెసిడెంట్ సిహెచ్ నాగరాజు,ఉపాధ్యాయులు,సిబ్బంది తదితరులున్నారు.

## పెండేకల్ ఆర్ఎస్ పాఠశాలలో సరస్వతీ పూజ

**తుగ్గలి,మార్చి 27,ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెండేకల్లు ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సరస్వతి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని చదువుల తల్లి సరస్వతీ దేవికి అభిషేకాలు చేసి టెంకాయలు కొట్టారు. అలాగే విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మైఖేల్ మాట్లాడుతూ పది పరీక్షలు రాసే విద్యార్థులు కష్టపడి కాకుండ ఇష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. ప్రతి విద్యార్థికి ఒక లక్ష్యం అనేది ఉండాలని కోరారు. గురువులు,తల్లిదండ్రులు మీ మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండ పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మన్ నాగరాజు,సీనియర్ ఉపాధ్యాయులు శివశంకర్‌రెడ్డి,రామకృష్ణ,వ్యాయామ ఉపాధ్యాయులు పాండురంగరాజు,నూనె నాయక్,పాఠశాల బోధన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ లాంచనాలతో అంబేద్కర్ జయంతి నిర్వహించాలి

**ఆదోని రూరల్,మార్చి 27,ప్రభాతవార్త :** ప్రభుత్వ లాంఛనలతో భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి నిర్వహించాలని దళిత సంఘం నాయకులు ఆర్ దేవిప్రసాద్,జైభీమ్ సాయిరాం,న్యాయవాది డి చంద్రయ్యలు అన్నారు. సోమవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.ఇందుకు సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని ప్రభుత్వ లాంఛనాలతో జరిపించడానికి అంగీకరించారన్నారు. దీంతో దళిత సంఘాల నాయకులందరు సబ్ కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు వైపి గంగాధర్,పరిగెల నారాయణ,లాలప్ప, నకులరాజ్,వైపి వీరేష్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌సబ్‌స్టేషన్‌కు భూమి పూజ

**క్రిష్ణగిరి,మార్చి27,ప్రభాతవార్త :** క్రిష్ణగిరి మండలంలోని చిట్యాల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సోమవారం క్రిష్ణగిరి ఎంపిపి కంగాటి వెంకటరామిరెడ్డి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ఈ సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నామన్నారు.ఈ సబ్‌స్టేషన్ మంజూరుకు కృషి చేసిన పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవికి ప్రజల తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డిఇ ప్రసాద్‌రెడ్డి,ఏడి రమణరావు,ఏఇ మద్దిలేటి,వైకాపా నాయకులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాలి



**కర్నూలు మున్సిపల్, మార్చి 27, ప్రభాతవార్త:** కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 37వార్డు లోని సోమిశెట్టి ఎస్టేట్‌లోని ఉల్చాల రోడ్డులో మురుగుకాల్వల నిర్మాణం చేపట్టాలని ఐద్వా జిల్లా కార ్యదర్శి, సిపిఎం మాజీ కార్పొరేట్ ఎన్ అలివేలమ్మ, టి రాముడులు కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో అడిషనల్ కమిషనరురామలింగేశ్వర్‌రావును కలిసి మురుగుకాల్వల నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సోమిశెట్టి ఏస్టేట్‌లోని గృహాలన్ని చిన్నపాటి వర్షానికే మురుగునీటితో జలమయం అవుతున్నాయన్నారు గతంలో సమస్యను పరిష్కరించాలని కమిషనరు భార్గవ్‌తేజ ఇంటి ఎదుట బైఠాయించగా సమస్యను పరిస్కరించేందుకు హామిఇచ్చారని కానీ ఇంతవరకు హామిని నేరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా కమిషనరు చొరవ తీసుకొని మురుగుకాల్వల నిర్మాణం చేపట్టి ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఐదా ్వ నాయకులు కెఎస్ పద్మా, కాలనీవాసులు శివాని, లక్ష్మీ, కోటేశ్వరమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తా

### - మంత్రి గుమ్మనూరు జయరాం



**ఆలూరు,మార్చి 27,ప్రభాతవార్త :** దేవాలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని చిప్పగిరి మండల పరిధిలోని నేమకల్,తిమ్మాపురం గ్రామాల్లో వెలసిన శ్రీ యల్లమ్మ దేవి దేవాలయ నిర్మాణం కొరకు మంత్రి గుమ్మనూరు జయరాం రూ.2లక్షలు గ్రామ సర్పంచ్ నాగేంద్ర,గ్రామపెద్దలు హేమంత్,ఎర్రన్నలకు విరాళం అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ప్రశాంతమైన గ్రామాల్లో అన్ని వర్గాల వారు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలని సూచించారు. అలాగే నియోజకవర్గంలోని దేవాలయాల నిర్మాణం కొరకు తనవంతుగా సహకారం ఎల్లప్పుడు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి గ్రామపెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆవులు పరిశీలన



**దేవనకొండ,మార్చి 27,ప్రభాతవార్త :** మండల పరిధిలోని కప్పట్రాళ్ల గ్రామం నందు జాతీయ వర్షాధార ప్రాంత పథకం కింద సబ్సీడీతో రైతులకు ఆవులను ఇవ్వడం జరిగింది. అయితే సోమవారం ఏడిఏ మోహన్ విజయ్‌కుమార్,మండల వ్యవసాయాధికారి సురేష్ బాబు,పశువైద్యాధికారి అనిలాలు సబ్సీడీ కింద ఇచ్చిన ఆవులను పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కప్పట్రాళ్ల గ్రామానికి 50శాతం రాయితీతో 7యూనిట్ల ఆవులను రైతులకు ఇవ్వడం జరిగిందని ఒక్కొక్క యూనిట్ కింద ఒక్కో రైతుకు 2ఆవులను ఇచ్చామన్నారు. కావున రైతులు ఆవులను సక్రమంగా పెంచుకుని పశుపోషణతో ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు యోగేంద్రబాబు,జయరాం,విహెచ్ఏ శివలింగ,రైతులు, యోగేశ్వరనాయుడు,లింగన్న,మహలింగడు,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి గిరకబండి పోటీలు

**ఆస్పరి,మార్చి 27,ప్రభాతవార్త :** మండల పరిధిలోని తురవగల్లు గ్రామంలో ఈ నెల 31న శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని రాష్ట్రస్థాయి గిరక బండి ఎద్దుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు రాఘవేంద్రరెడ్డి,నాగభూషణం,టి అర్జున్, ఓబులేష్,నరసన్న,ఇస్మాయిల్ భాష,లక్ష్మీకాంత్,కిష్టప్పలు సోమవారం విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఈ నెల 31న శ్రీరామనవమి పండుగ పురస్కరించుకుని సీతారాముల కళ్యాణం సందర్భంగా రాష్ట్రస్థాయి గిరక బండి ఎద్దుల పోటీలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం,గుమ్మనూరు శ్రీనివాసులు,గుమ్మనూరు నారాయణస్వామిల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొను ఎద్దులబండి జతల యజమానులు ఈ నెల 31వ తేదీ ఉదయం 8గంటలలోపు రూ.600లు ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేరు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఎద్దుల జతలకు మొదటి బహుమతి రూ.20,016,2వ బహుమతి రూ.15,016,3వ బహుమతి రూ.10,016లు,4 బహుమతి రూ.8,016లు,5వ బహుమతి రూ.6,016లు,6వ బహుమతి రూ.5,016లు,7వ బహుమతి రూ.4,016లు,8వ బహుమతి రూ.3,016లు,9వ బహుమతి రూ.2,016లు,10వ బహుమతి రూ.2,016లు,11వ బహుమతి రూ.1516లను దాతలు అందచేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9848451252, 9618449870, 9666864826లను సంప్రదించాలన్నారు.

## ఢిల్లీ పోరాట ప్రదర్శనను జయప్రదం చేయాలి



**హొళగుంద,మార్చి 27,ప్రభాతవార్త :** ఏప్రిల్ 5న ఢిల్లీలో జరుగు కార్మిక,కర్షక పోరాట ప్రదర్శనను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, సిఐటియు మండల కార్యదర్శి నాగరాజ్‌లు పిలుపునిచ్చారు. సిఐటియు,రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బస్టాండ్‌లోని నాగప్ప కట్ట వద్ద చలో ఢిల్లీ గోడపత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని,ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్మిక, కర్షక పోరాట ప్రదర్శనలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. మండలంలోని బస్టాండ్‌లో స్కూల్ వాల్,తహశీల్దార్ కార్యాలయం దగ్గర గోడపత్రికలను అతికించడం జరిగిందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని,కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని,కార్మిక,కర్షక హక్కులకై ఏప్రిల్ 5న జరిగే చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షులు రవికుమార్,సూరన్న,ఈసా, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దప్రమాదం నుండి బయటపడ్డ లక్కీ టు యాదవ్ సోదరులు

**ఆలూరు,మార్చి 27,ప్రభాతవార్త :** ఇటీవల నందిగామ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్కీ టు సోదరులు రాంపుల్లయ్య యాదవ్,తెదేపా రాష్ట్ర కార్యదర్శి,హిందూపురం పరిశీలకులు నరసింహులు యాదవ్‌లు పెద్ద ప్రమాదం నుండి బయట పడ్డారని ఆలూరు టిడిపి నాయకులు,యాదవ సంఘం నాయకులు అన్నారు. సోమవారం బెల్డోన సర్పంచ్ గోవిందు యాదవ్,మండల కన్వినర్ అశోక్ యాదవ్,యాదవ్ ఉత్తాన్ సమితి జిల్లా అధ్యక్షులు రాముయాదవ్,ముద్దటమాగి తిమ్మారెడ్డి,గోపాల్,వీరేష్,బాబు, చంద్రలు పరామర్శించారు. ప్రమాద సంఘటనపై వారితో చర్చించారు. అలాగే అనంతపురంలో నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలన్నారు. నేడు గోరంట్లలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా,యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## జగనన్నకు పాలాభిషేకం చేసిన వాల్మీకులు

**పత్తికొండ,మార్చి27,ప్రభాతవార్త:** పత్తికొండ పట్టణంలో రాములవారి ఆలయ ఆవరణంలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు వాల్మీకి సంఘం నాయకులు ఆస్పరి నరేంద్ర,శివశంకర్ నాయుడు,జయరాముడు,శేఖర్‌ల ఆధ్వర్యంలో వాల్మీకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చి త్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఆస్పరి నరేంద్ర,రాములవారి ఆలయ కమిటీ చైర్మన్ శివశంకర్ నాయుడు,ఎద్దులదొడ్డి జయరాముడులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకులను గుర్తించినందుకు వారు ధన్యవాదాలు తెలిపారు.వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల కలిగే రిజర్వేషన్ వల్ల వాల్మీకుల పిల్లలు విద్య,ఉద్యోగాలల్లో ఉన్నతస్థాయికి చేరుకుంటారని వారు తెలిపారు.అలాగే వాల్మీకుల భవిష్యత్ గురించి ఆలోచించి రిజర్వేషన్ కల్పించే దిశగా చర్యలు తీసుకున్నందుకు వారు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మధు,కౌలుట్లయ్య, చిన్నహుళ్తి రంగప్ప రాజు,వాటర్‌ప్లాంట్ కౌలుట్ల,మార్కెట్ చిన్న,రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## తూతు మంత్రంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

**పత్తికొండ,మార్చి27,ప్రభాతవార్త:** పత్తికొండ పట్టణంలో వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్,వాటర్ బాటిళ్ల విక్రయించకూడదని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరప్ప తెలిపారు.సోమవారం పట్టణంలోని వివిధ కూల్‌డ్రింక్స్ షాపుల్లో ఆయన తూతు మంత్రంగా తనిఖీ నిర్వహించారు.కాగా వివిధ కూల్‌డ్రింక్స్ షాపు నిర్వాహకులు బాటిళ్ల పై ఉండే తేదిలను సిరాతో కనపడకుండా చేసి వాటిని విక్రస్తు సొమ్ము చేసుకుంటున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.కాగా ఈ తనిఖీల్లో అటువంటి బాటిళ్ల ఉన్నప్పటికి సంబంధిత అధికారి షాపుల యజమానుల పై చర్యలు తీసుకోకుండా తూతు మంత్రంగా తనిఖీలు నిర్వహించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రజారోగ్యాలను దెబ్బతీసే ఇటువంటి కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్,వాటర్ బాటిళ్లను నిషేధించి వాటిని విక్రయించే షాపుల నిర్వాహకుల పై చర్యలు తీసుకోవాల్సిందిపోయి సంబంధిత అధికారి తూతు మంత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రజలు వాపోతున్నారు.

## శ్రీ మద్దిలేటి లక్ష్మినరసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు

– రూ.39.80లక్షల ఆదాయం



**బేతంచెర్ల,మార్చి27,ప్రభాతవార్త:** ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మినరసింహస్వామి ఆలయంలోని స్వామివారి అమ్మవారి హుండీల లెక్కింపు ద్వారా రూ.39,80,632ల ఆదాయం చేకూరినట్లు ఈవో పాండురంగారెడ్డి,చైర్మన్ బి.సీతారామచంద్రుడులు సోమవారం తెలిపారు.దేవాదాయశాఖ తనిఖీ అధికారి శ్రీనివాసరెడ్డి సమక్షంలో స్వామివారి అమ్మవార్లకు 45రోజులుగా భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించడం జరిగింది.ఇందులో స్వామివారి హుండీల ద్వారా రూ.34,47,718లు,అమ్మవారి హుండీ ద్వారా రూ.5,32,914ల నగదు,95గ్రాముల బంగారం,2కేజీల 400గ్రాముల వెండి వచ్చినట్లు వారు తెలిపారు.హుండీ లెక్కింపు కార్యక్రమంలో ధర్మకర్త లక్ష్మినాయుడు,ఆలయ సిబ్బంది,అర్చకులు,భక్తులు పాల్గొన్నారు.

## వ్యక్తి పై దాడి - కేసు నమోదు

**బేతంచెర్ల,మార్చి27,ప్రభాతవార్త:** మండల పరిధిలోని నాగమల్లకుంట గ్రామానికి చెందిన జయరామిరెడ్డి పొలంలోకి అక్రమంగా చొరబడి దాడి చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ శివశంకర్‌నాయక్ సోమవారం తెలిపారు.వివరాల మేరకు గూటుపల్లెకు చెందిన నాయిని రామకృష్ణ,చల్లా మద్దిలేటి,రామాంజనేయులు,మరో ముగ్గురు జయరామిరెడ్డి పొలంలోకి అక్రమంగా చొరబడి తన పై రాడ్లతో,కట్టెలతో దాడులు చేశారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

**పొలం తగాదాలో ఎనిమిది మంది పై కేసు నమోదు :** మండల పరిధిలోని గూటుపల్లెకు చెందిన నాయిని రామకృష్ణ పై నాగమల్లకుంటకు చెందిన ఎనిమిది మంది పొలం తగాదాలో దాడి చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఏఎస్ఐ లింగమయ్య సోమవారం తెలిపారు.వివరాల మేరకు గూటుపల్లెకు చెందిన రామకృష్ణ 1037/1,1037/2 సర్వేనంబర్ల నందు తనకు 8.56ఎకరాల భూమి ఉందని దానిని ఎద్దుల జయరామిరెడ్డి,ఎద్దుల వెంకటేశ్వరరెడ్డి ఆక్రమించుకోవడంతో డోన్ సివిల్ కోర్టు ద్వారా ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నానని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.ఈనెల 23వ తేదిన కోర్టు జడ్జిమెంట్ కాపీని బేతంచెర్ల తహసీల్దార్‌కు అందించి 26వ తేదిన ఇంజక్షన్ ఆర్డర్ ఉందని బోర్డు నాటేందుకు వెళ్లిన బాధితుడు రామకృష్ణని అతడి బామర్ది చల్లా మద్దిలేటి,అన్న బిజ్జన్నగారి రామాంజనేయులును,ఎద్దుల జయరామిరెడ్డి, ఎద్దుల వెంకటేశ్వరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి,మహేశ్వరరెడ్డితోపాటు మరో నలుగురు తమ పై రాళ్లతో,కట్టెలతో దాడి చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి - సీఐటీయు

**బేతంచెర్ల,మార్చి27,ప్రభాతవార్త:** దేశంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక,కర్షక,ప్రజా వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని ఏప్రిల్ 5వ తేదిన ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు యల్లయ్య,కార్యవర్గ సభ్యులు వై.బి.వెంకటేశ్వర్లు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లానాయకులు ఈశ్వరయ్యలు పిలుపునిచ్చారు.సోమవారం స్థానిక సీఐటీయు కార్యాలయంలో మండల నాయకుడు బాలయ్య అధ్యక్షతన చలో ఢిల్లీ వాల్‌పోస్టర్లను కార్మికులతో కలిసి వారు విడుదల చేశారు.ఈ సందర ్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ప్రజా సంపదనంతా పెట్టుబడిదారులకు,కార్పొరేట్ సంస్థలకు దోచి పెడుతున్నరన్నారు.నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకునివచ్చి మధ్యతరగతి,కార్మికుల జీవనస్థితిగతుల పై దెబ్బకొట్టారని వారు ఆరోపించారు.వీటితోపాటు పలు ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో లక్షలాది మందితో చేపట్టే నిరసన కార్యక్రమానికి అధిక సంఖ్యలో కార్మికులు,ప్రజలు కదిలిరావాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నూరుల్లాఖాద్రీ, అంకాలు,పలువురు కార్మిక నాయకులు,కార్మికులు పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి భూమి పూజ



**కోవెలకుంట్ల,మార్చి 27,ప్రభాతవార్త :** పట్టణంలోని గాంధీ సెంటరు నందు విజ్ఞానమును పెంపొందించడానికి ఏర్పాటు చేసిన కామ్రేడ్ కొండారెడ్డి గ్రంథాలయాని మరింత విస్తరించేందుకు రెండవ అంతస్తు నిర్మాణము చేసేందుకు భూమిపూజను పట్టణ ఉపసర్పంచు జిసిఆర్ సూర్యనారాయణరెడ్డి చెశారు. ఇప్పటికే ఈ కొండారెడ్డి గ్రంథాలయలం ఎంతో మంది నిరుద్యోగులకు, విద్యార్థులకు రిటైర్డ్ ఉద్యోగులకు విజ్ఞానము పంచుతుంది. అయితే ఇక్కడ పాఠశాల తాకిడి అధికముగా ఉండటముతో గ్రంథాలయాని మరింత విస్తరించడానికి పై అంతస్తు నిర్మాణమునకు దాత సహారముతో సోమవారము జిసిఆర్ సూర్యనారాయణరెడ్డి భూమిపూజ చేశారు ఈకార్యక్రమంలో రామచంద్రరాజు అప్పపోగు వెంటకసుబ్బయ్య కరీంభాష, కామినివేణుగోపాల్‌రెడ్డి దాట్ల వెంకటసుబ్బారెడ్డి, యువజన సమాఖ్య మాజీ అద ్యలక్షుల ముడిమాల శివశంఖరెడ్డి,రిటైర్డ్ బ్యాంకు అదికారి సుఖూరు, నూరుభాష, ఎగ్గోని ఓబులేసు, జాఫరు,ఖాశీమ్, టైలరుమాబు,యంఆర్‌పియస్ నాయకుడు సుబ్బయ్య, సుబ్బరాయుడు,పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**గడివేముల, మార్చి27, ప్రభాతవార్త ;** మండలకేంద్రమైన గడివేములలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్స రం ప్రవేశాలు పొందుటకు విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ రుబీనా సోమవారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈనెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనాథ పిల్లలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తుకు అర్హులన్నారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసేందుకు విద్యార్థి ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, విద్యార్థి ఫోటో, స్టడీ సర్టిఫికెట్‌లను ఉంచి ఆన్‌లైన్‌లో లింక్ అయిన హెచ్‌టీటీపీఎస్;//ఏపీకేజీబీవీ డాట్ ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్ డాట్ ఇన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందిని సంప్రదించాలన్నారు.

## ఉద్యోగులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి - ఏపీ జేఏసీ నాయకుడు సత్యదీప్

**బేతంచెర్ల,మార్చి27,ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించికునేందుకు ప్రతిఒక్క ఉద్యోగి ఐక్య ఉద్యమాల్లో భాగస్వామిగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు ముందుకురావాలని ఏపీ జేఏసీ నాయకుడు,డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్ పిలుపునిచ్చారు.గత కొన్ని రోజులుగా ఏపీ జేఏసీ పిలుపు మేరకు చేపట్టిన నిరసనలో భాగంగా సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సాయంకాలం 5గంటలకు తహసీల్దార్ కార్యాలయ తలుపులు మూసివేసి రెవెన్యూ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సత్యదీప్ మాట్లాడుతూ ఈనెల 21వ తేది నుండి నిరసనలో భాగంగా వర్క్ టూ రూల్ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు.ప్రభుత్వం సూచించిన మేరకే ఉదయం 10.30గంటల నుండి సాయంకాలం 5గంటల వరకే పని సమయమం అమలు చేయాలని నిరసన చేపట్టడం జరుగుతుందన్నారు.అలాగే కరోనా సమయంలో కరోనాతో మృతి చెందిన ఉద్యోగుల స్థానంలో కారుణ్య నియమాకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని పరిష్కరించికునేందుకు ప్రతిఒక్క ఉద్యోగి ఉద్యమంలో భాగస్వామై ముందుకు రావాలని ఆయన కోరారు.ఈ కార్య క్రమంలో ఆర్ఐ శ్రీదేవి,సర్వేయర్ జ్యోస్న,వీఆర్వోలు,వీఆర్ఏలు, జూనియర్ అసిస్టెంట్ అశోక్ కుమార్,పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## వేలం పాటలో గ్రామ పంచాయతీకి తగ్గిన ఆదాయం

**గడివేముల, మార్చి27, ప్రభాతవార్త ;** గడివేముల గ్రామ పంచాయతీకి గత సంవత్స రం వేలంతో పోలిస్తే ఈ సంవత్సర ఆదాయం రూ.9 వేలు తగ్గిందని పంచాయతీ అధికారులు తెలిపారు. సోమవారంనాడు పంచాయతీ కార్యాలయంలో గడివేముల గ్రామ పంచాయతీకి చెందిన ఐదు రూములను మరియు సంతగేట్ బస్టాండు గేట్లను గ్రామ సర్పంచ్ ఎ.రవణమ్మ, ఈఓఆర్‌డీ కాలిక్‌బాషా, పంచాయతీ కార్యదర్శులు తారకేశ్వరి, రంగడు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. గత సంవత్స రం రూ.5,80,000 వచ్చిందని, గతంతో పోలిస్తే ఆదాయం రూ.9 వేలు తగ్గినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలంపాటదారులు పాల్గొన్నారు.

## మైపర్ ఫార్మసీ కళాశాలలో ఇండస్ట్రీయల్ వర్క్‌షాపు

**కర్నూలు విద్య, మార్చి 27, ప్రభాతవార్త:** కర్నూలు నగరంలోని ఏక్యాంపు నందు గల మదర్‌థెరిస్సా బీ ఫార్మసీ కళాశాలలో సోమవారం వీర్కోబైటెక్ హెచ్ ఆర్ సీనియర్ మేనేజర్ రఘురాం రెడ్డి గారిచే బీఫార్మసీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఇండస్ట్రీ కాంపిటెంట్ స్కిల్స్ నేర్పించడం జరిగింది. ఇందులో భాగంగా ఇండస్ట్రీ ఎక్విప్మెంట్, ఉద్యోగ నైపుణ్యతను పెంపొందించడం జరిగింది. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషిచేసిన విర్కోబైటెక్ సీనియర్ మేనేజరు, కళాశాల డైరెక్టరు అదిమూలపు సతీష్ కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.రవికుమార్‌రెడ్డి, వైస్ ప్రిని ్సపాల్ డా. కాసర్ల సురేష్, అకాడమిక్ డీన్ రాజ్‌కుమార్ ఇతర అధ్యాపకులు వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రబోదానందస్వామి సూచను సన్మార్గమునకు మార్గదర్శకాలు : డాక్టరురామిరెడ్డి



**కోవెలకుంట్ల,మార్చి 27,ప్రభాత వార్త :** హిందువులకు శ్రీప్రబోదనం దస్వామి చేసిన సూచనలు సన్మా ర్గమునకు మార్గదర్శికాలని వైసిపి సీనియర్ నాయకుడు ఉమ్మడి జిల్లాల డాక్టర్ల సంఘం అద్యక్షులు డాక్టరు రామిరెడ్డి అన్నారు. సోమవారము శ్రీ ప్రబోదనంద స్వామి త్రైత సిద్దాంత యుగాది తెలుగు క్యాలెండరు డాక్టరు రామిరెడ్డి అవిస్కరించారు.ఈసందర్భముగా అయన మాట్లాడుతూ హిందువులకు ప్రబోదినంద స్వామి క్యాలెండరులో చేసిన సూచనలు చాలా అద్భుతముగా ఉన్నాయని చెప్పారు. ఈ క్యాలెండరు సిఐ నారాయణరెడ్డి ఉపసర్పంచు సూర్యనారాయనతెడ్డి మార్కెట్ యాడు మాజీ చైర్మన్ నాగార్జునరెడ్డి హోరోహోండా షోరూం అదినేత జగన్‌మోహన్‌రెడ్డి తహశీలుదారు పుష్పకుమారి, టౌన్ బ్యాంకు సెక్రటరీ శేషగిరిరావు, ప్రభుత్వం అసుపత్రి డాక్టర్లు అవిస్కరించారు.

## 30న పగిడ్యాలలో పోటీలు

**పగిడ్యాల, మార్చి 27, ప్రభాతవార్త :** శ్రీలక్ష్మిచెన్నకేశవస్వామి, శ్రీరామనవమి తిరుణాల సందర్భంగా మండల కేంద్రమైన పగిడ్యాలలో ఈ నెల 30వ తేదీన ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి కబడీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ తిరుణాల సందర్భంగా కబడీ పోటీలను నిర్వహిస్తున్నామనీ, మొదటి బహుమతి రూ. 20,000,వబహుమతి రూ. 15,000లు, 3వ బహుమతి రూ. 12,000లు, 4వబహుమతి రూ. 10,000లు, 5వ బహుమతి రూ. 8,000లు, 6వ బహుమతి రూ. 5,000లు గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులను అందజేస్తామనీ తెలిపారు. ప్రవేశరుసుము రూ.400లు చెల్లించి జట్లపేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కబడీ క్రీడాకారులకు భోజన వసతి కలదనీ తెలిపారు. ప్రవేశరుసుము రూ. 200లు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

## మత్స్యకారులను ఆదుకోవాలి

**కొత్తపల్లి,మార్చి 27,ప్రభాతవార్త:** కొత్తపల్లి మండలంలోని కృష్ణా నది తీర గ్రామాల్లో ఎక్కువ శాతం చేపల వేటను సాగించి జీవనోపాధి పొందుతున్నారు. పాతమాడుగుల, కపిలేశ్వరం, జానాలగూడెం, బలపాలతిప్ప గ్రామాల్లోని జనం మొత్తం సంగమేశ్వరం తీరాన చేపలు పడుతు జీవనం కొనసాగిస్తున్నారు. ముసలిమడుగు, ఎర్రమఠం, గుమ్మడాపురం గ్రామాల్లో కొన్ని కుటుంబాలు ఆయా గ్రామాల కృష్ణా నది తీరాన చేపల వేటపై ఆధారపడి జీవనం చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నీటి మట్టం అధిక స్థాయిలో తగ్గడంతో ముసలిమడుగు, ఎర్రమఠం, పాతమాడుగుల గ్రామాల తీరాన కృష్ణజలాలు చుక్క నీరు లేకుండా ఎండిపోయింది. సంగమేశ్వరం సమీపంలో కూడా కృష్ణాజలాలు తగ్గడంతో చేపల వేటకు వెళ్ళిన చేపలు చిక్కక పోవడం వలన బోట్లు నది ఒడ్డుకే పరిమితమయ్యాయి. దీంతో కుటుంబాలకు పోషణ ప్రశ్నార్థకంగా మారింది. సుమారు ఆరు నెలల చేపల వేటకు అవకాశం లేకుండ పోవడంతో పూట ఎలా గడుస్తుందోనని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మమ్ములను ఆదుకోవాలని మత్స్యకారులను కోరారు.

## 2న అంతర్ రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

**కొత్తపల్లి,మార్చి 27,ప్రభాతవార్త:** శ్రీరామ నవమి పండుగ మరియు రథోత్స వం సందర్భంగా నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం ఎదురుపాడు గ్రామంలో ఏప్రిల్ 2వ తేదీన అంతర్ రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు(4 పల్ల విభాగం) నిర్వహిస్తున్నట్లుగా గ్రామ కమిటీ పెద్దలు తెలిపారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు దాతల ద్వారా నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మొదటి బహుమతిగా రూ.30,016లు, రెండవ బహుమతి రూ.20,016లు, మూడవ బహుమతి రూ.15,016లు, నాల్గవ బహుమతి రూ.10,016లు, ఐదవ బహుమతి రూ.6,016లు, ఆరవ బహుమతి రూ.5,016, ఏడవ బహుమతి రూ.4,016, ఎనిమిదవ బహుమతి రూ. 2,016లు దాతలచే బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. పోటీలలో పాల్గొనే వారు ఏప్రిల్ 2వ తేదీ ఉదయం ఏడు గంటలలోపు ఎంట్రీఫీజు రూ.500లు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ధర్మకర్తలు యర్రబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, బలసాని రామలింగారెడ్డి తెలిపారు.

## 29న పురపాలక సంఘ సమావేశం

**నందికొట్కూరు,మార్చి 27,ప్రభాతవార్త:** ఈ నెల 29న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమీషనర్ కిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారినికి కమీషనర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు హాజరవుతారని కావున అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజర్ కావాలని కమీషనర్ తెలిపారు.

## అరుణ్‌జ్యోతి నగర్‌లో పబ్లిక్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి



**ఆదోని,మార్చి 27,ప్రభాతవార్త :** పట్టణంలోని అరుణ్‌జ్యోతి నగర్‌లో పబ్లిక్ మరుగుదొడ్లు,బోరు వాటర్ ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ బండారి గిడ్డయ్య మాదిగ,పట్టణ ఇంచార్జ్ గుమ్మల బాలస్వామి మాదిగలు అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్,ఎంఎస్‌పి ఆధ్వర్యంలో మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరుణ్‌జ్యోతి నగర్‌లో మహిళలకు మరుగుదొడ్లు లేకపోవడంతో చెంబు తీసుకుని దగ్గరలో ఉన్న స.నం 264లో భూమిలో బహిర్భూమికి వెళ్లేవారు ఇప్పుడు ఆ భూమిని కొంతమంది వ్యక్తులు ఈ భూమి మాది అని కాంపౌండ్ వాల్ నిర్మించుకుని కాలనీవాసులకు చాలా ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. కావున మున్సిపల్ కమీషనర్,చైర్మన్,వైస్ చైర్మన్లు అరుణ్‌జ్యోతి నగర్‌లో అదే స్థలంలో మరుగుదొడ్లు నిర్మించి మహిళలు,పురుషులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. సర్వేనంబర్ 265,264లో కొంత ప్రభుత్వ భూమి ఉందని దానిని మున్సిపల్ కమీషనర్ గమనించి ఆ భూమిని స్వాధీనం చేసుకుని కాలనీలో జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాల్,పబ్లిక్ పార్క్,పబ్లిక్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వేసవి కావడంతో కాలనీలో కొన్ని చేతిపంపు బోర్లు మరమత్తులకు గురయ్యాయని వాటిని మరమత్తులు చేయించి నీరు వచ్చేలా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి మండల ఇంచార్జ పిఎస్ వీరేష్,ఎమ్మార్పీఎస్ నాయకులు ఈరన్న,దిబ్బనకల్ హుసేని,జిఎస్‌టి అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న గోరుముద్ద తనిఖీ చేసిన కౌన్సిలర్



**నందికొట్కూరు,మార్చి 27,ప్రభాతవార్త:** పట్టణంలోని 15వ వార్డులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం వార్డు కౌన్సిలర్ కృష్ణవేణి జగనన్న గోరుముద్దను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా 3వ తేదీ నుండి 10వ తరగతి పరీక్షలు వ్రాసే విద్యార్థులు బాగా రాసి మంచి మార్కులు తెచ్చుకొని పాఠశాలకు మంచి పేరు తేవాలని తెలిపారు. అనంతరం గోరుముద్దను విద్యార్థులతో కలిసి తిని రుచి చూశారు. వంట ఏజెన్సీ నిర్వాహకులకు విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని కావున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

## విద్యార్థులు కష్టపడి కాకుండ ఇష్టపడి చదవాలి



**హొళగుంద,మార్చి 27,ప్రభాతవార్త :** విద్యార్థులు కష్టపడి కాకుండ ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లికార్జున,పరమేష్‌లు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఇంగళదహాల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు సర్వసతి పూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే పది పరీక్షల సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఈ పరీక్ష ప్యాడ్‌లను ఉపాధ్యాయుల చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది పరీక్షల్లో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండ ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. ప్రతివిద్యార్థి బాగా చదివి చదివిన పాఠశాల,కన్న తల్లిదండ్రులు,పాఠాలు చెప్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెంచుగూడెంలో సమస్యలు పరిష్కారానికి చర్యలు



**కొత్తపల్లి,మార్చి 27,ప్రభాతవార్త:** మండల పరిధిలోని చెంచుగూడెంలో నెలకొన్న సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసకుంటామని ఐటిడిఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీంర్ లత తెలిపారు. సోమవారం ఎదురుపాడు చెంచుగూడెంను ఆమె సందర్శించారు. గూడెంలో మౌలిక సదుపాయల గురించి ఆరా తీసారు. తమ గూడెంలో కొందరికి ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు, కొందరికి రేషన్ కార్డులు, తమ పొలాల్లో సాగుకు నీరులేదని, పొలం లేని వారికి సాగు చేసుకోవడానికి భూమి కావాలని, ఏదైన జీవనోపాధి చూపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఎఇ ప్రదీప్, పంచాయితీ కార్యదర్శి క్రాంతికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పోషణ్ పక్వాడా



**నందికొట్కూరు,మార్చి 27,ప్రభాతవార్త:** పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పోషణ్ పక్వాడా బాగంగా ఈ నెల 20 నుండి ఎప్రిల్ 3వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో కళాశాల మరియు పాఠశాలలోని విద్యార్థినీలకు మిలిట్స్ (చిరుధాన్యాలు) అవి ఆరోగ్యానికి ఏవిధంగా ఉపయోగ పడుతాయో సి.డి.పి.ఓ. కోటేశ్వరీ అవగాహన కల్పించారు. సోమవారం జరిగిన మిలిట్ బేస్డ్ అవగాహనలో విద్యార్థినీలు రక్త హీనతకు గురికాకుండా ప్రభుత్వం అంధిస్తున్న జగనన్న గోరుముద్ద, రాగిజావా తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరు బాల్య వివాహాలను వ్యతిరేకించాలని ఆమె తెలిపారు. అనంతరం ఎగ్జిబిషన్ ద్వారా చిరుధాన్యాలను ప్రదర్శనతో వారికి పలు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ క్రిష్ణవేణి, సూపర్‌వైజర్లు ఆశీర్వాదమ్మ, అనురాధ, మహిళా సంరక్షణా కార్యదర్శి లావణ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పగిడ్యాలలో ఏప్రిల్ 1న వృషభరాజముల బలప్రదర్శన పోటీలు

**పగిడ్యాల, మార్చి 27,ప్రభాతవార్త :** నంద్యాల జిల్లా పగిడ్యాలలో శ్రీలక్ష్మిచెన్నకేశవస్వామి,శ్రీరామనవమి తిరుణాల సందర్భంగా ఏప్రిల్ 1వతేదీన 6పండ్ల సైజు వృషభరాజముల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు అలయ ధర్మకర్తమండలి చైర్మెన్ గ్రామకమిటీ సభ్యులు బొబ్బిటి. నాగేశ్వరరెడ్డి, భాస్కరెడ్డి, గంగిరెడ్డిగారి లక్ష్మిరెడ్డి, పుల్యాల శ్రీనివాసరెడ్డితెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ వృషభరాజముల బలప్రదర్శన పోటీలలో గెలుపొందిన వృషభరాజముల యజమానులకు 1వ బహుమతి రూ.50,000లు, 2వ బహుమతి రూ. 40,000లు, 3వ బహుమతి రూ. 30,000లు, 4వ బహుమతిరూ. 20,000లు, 5వ బహుమతి రూ.10,000లు, 6వబహుమతి రూ. 5,000లు, అందజేయడం జరుగుతుందన్నారు. ప్రవేశరుసుము రూ.500లు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.వృషభరాజముల యజమానులకు భోజన వసతి కల్పించడం జరుగుతుందన్నారు.

## సారు కుక్కల బారి నుండి రక్షించండి



**నందికొట్కూరు,మార్చి 27,ప్రభాతవార్త:** సారు కుక్కల బారి నుండి మమ్మల్ని రక్షించండి అంటూ పట్టణంలోని మహిళలు కమీషనర్‌కు మొరపెట్టుకున్నారు. సోమవారం హాజీనగర్‌లో ఇళ్ళ నుండి బయటికి రావాలంటే పెద్దలు, పిల్లలు తీవ్ర భయోంధళనకు గురి అవుతున్నామని మూడు రోజులలో దాదాపు 12 మందిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయని కేవలం హాజీనగర్‌లోనే కాదు పట్టణంలో ఎక్కడ పడితే వీధులలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని దీనిపై తగు చర్యలు తీసుకోవాలని మహిళలు కమీషనర్ కిషోర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ దాసి సుధ్యాకర్‌రెడ్డిని కలిసి పరిస్థితి వివరించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సేవాస్తంబ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పూల వీరయ్య ఎన్నిక

**కర్నూలు రూరల్,మార్చి 27,ప్రభాతవార్త :** అఖిల భారత ఎస్‌సి,ఎస్‌టి, బిసి,మైనార్టీ ఉద్యోగ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులుగా పూల వీరయ్యను ఎన్నుకున్నారు. స్తంబ్ రాష్ట్ర సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం కర్నూలు పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షులు కందుల నాగేశ్వరరావు,జికెడి వరప్రసాద్,ఒడిస్సా రాష్ట్ర అధ్యక్షులు బొమ్మలి కాంతారావు,జాతీయ సిఈసి మెంబర్ జి రత్నాకర్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రంలోని 18జిల్లాల అధ్యక్ష,కార్యదర్శులు, అనుబంధ స్వచ్ఛంధ సంస్థలు కర్నూలు జిల్లా సేవాసం అధ్యక్షులు ఎం మునిస్వామి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు మాట్లాడుతూ సేవస్తమును 1969లో కర్నూలు నుంచి మొదటి దళిత ముఖ్యమంత్రిగా ఉన్న దామోదరం సంజీవయ్య జాతీయ స్థాయిలో బహుజన కులాల ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉండాలని మంచి ఉద్దేశ్యంతో ఈ సంఘాన్ని జాతీయస్థాయిలో ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా 18రాష్ట్రాలలో ఈ సంఘాన్ని దిగ్విజయంగా విరాజిల్లుతుందని వివరించారు. దీని ద్వారా ఇటు ఉద్యోగ సమస్యలు కానీ ఎన్జీఓలకు కేంద్ర స్థాయి నుంచి విధులు రాబట్టి దళిత బహుజనులకు ఎంతో ఉపయోగంగా ఉన్నదని వివరిస్తూ సేవాస్తంబ్ రాష్ట్ర ఎన్నికలను కర్నూలులో నిర్వహించారన్నారు. ఈ ఎన్నికలను ఆంధ్ర రాష్ట్రంలోని 18జిల్లాల అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొని ఎన్నికలు జయప్రదం చేశారన్నారు. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా జికెడి వరప్రసాద్ వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్షుడుగా పూల వీరయ్య,రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన జి స్వరూప్‌దత్‌ని పైన తెలిపిన 18జిల్లాల వారు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కావున వీరు రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో ఉన్నవారిని పూర్తిస్థాయి రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేయాలని జాతీయ అధ్యక్షులు నూతనంగా ఎన్నుకున్న ఏపి రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులకు వివరించారు. సేవాస్తంబ్ సీనియర్ నాయకులు డిపి సోమన్న,సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌లు ఎస్ కోటయ్య,ఎస్ మోహన్‌రావు ,ప్రధాన కార్యదర్శి ఎం గోపాల్‌సింగ్,ఫైనాన్స్ సెక్రటరీ గుర్రాల శ్రీనివాసులు ,సేవాస్తంబ్ చెందిన వివిధ జిల్లాల సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడం అన్యాయం

:- టిడిపి ఎస్‌టి సెల్ జిల్లా కార్యదర్శి రామునాయక్



**తుగ్గలి,మార్చి 27,ప్రభాతవార్త :** రాజకీయ లబ్ది కోసం వాల్మీకి బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మాణం చేయడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి గిరిజన ద్రోహిగా మిగిలిపోతారని టిడిపి ఎస్‌టి సెల్ జిల్లా కార్యదర్శి రాము నాయక్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ గిరిజనులకు ఎటువంటి సంక్షేమ పథకాలు లేక ఎస్‌సి,ఎస్‌టి స్పెషల్ డ్రైవ్ ఉద్యోగాలు రాక,గిరిజనులు ఆర్థికంగా రాజకీయంగా చాలా వెనకబడి ఉన్నారన్నారు. ఎస్‌టి విద్యార్థులు డిగ్రీలు పిజిలు,బిఎ లతో పాటు మరెన్నో చదువులు చదివి ఉద్యోగాలు లేక ఆర్థికంగా ఎదగలేక కొండలకు గుట్టలకు పరిమితమైపోతున్నారన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ది చెందిన వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడం సరైంది కాదన్నారు. ఇప్పుడిప్పుడే విద్యా,ఉద్యోగ అవకాశాలను అందుకుంటున్న గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం వారి అభివృద్దిని అడ్డుకునేందుకు వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చి కుట్ర చేస్తుందన్నారు. ఓట్ల రాజకీయాల కోసం అన్నదమ్ముల్లా ఉన్న వాల్మీకులు,గిరిజనుల మధ్య వైసిపి ప్రభుత్వం చిచ్చు పెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఏకగ్రీవంగా బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని తీర్మాణించి కేంద్రప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం పంపించడానికి ఆయన తీవ్రంగా ఖండించారు. దీంతో వైకాపా ప్రభుత్వం గిరిజనుల పట్ల ఇలాంటి వైఖరి వ్యవహరిస్తే గిరిజనులు వైసిపికి గట్టి గుణపాఠం చెబుతారన్నారు. బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరిస్తే గిరిజనులు ఏకతాటిపైకి వచ్చి తమ హక్కులను కాపాడుకునేందుకు పెద్దఎత్తున ఉద్యమించేందుకు సిద్దమవుతామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమీషన్ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే ఆలోచన విరమించుకుని భారత రాజ్యాంగాన్ని కాపాడాలని ఆయన కోరారు.

# చెరువులో అక్రమ తవ్వకాలు

**:-జెసిబి,పది ట్రాక్టర్లతో గరుసు రవాణా**

**:-అనుమతులు లేకుండా తవ్వకాలు**

**:-పట్టించుకోని అధికారులు**



**మంత్రాలయం,మార్చి 27,ప్రభాతవార్త:** మండల పరిధిలోని సు ంకేశ్వరి గ్రామ సమీపంలో ఉన్న బసలదొడ్డి చెరువులో గత కొన్ని రోజులుగా అక్రమంగా గరుసును తవ్వుతున్నారు.ఒక జెసిబి,సుమారు పది ట్రాక్టర్లతో ఈ గరుసును అక్రమంగా రవాణా చేస్తున్నారు.సుంకేశ్వరి గ్రామానికి చెందిన ట్రాక్టర్లు ఈ గరుసు అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు.ఈ చెరువులో ఎక్కడ చూసినా మట్టిని,గరుసును తవ్వడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి.ఒక్కో ట్రాక్టర్ గరుసును రూ.1500 నుండి రూ.2000 వరకు విక్రయిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.పట్టపగలే ఈ చెరువులో అక్రమంగా గరుసును తోలుతుంటే అడిగేవారే కరువయ్యారు.గరుసును తవ్వాలంటే మైనింగ్ అధికారులు,రెవిన్యూ అధికారులతో తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.అయితే ఇక్కడ అటువంటి అనుమతులు లేకుండానే చెరువును జెసిబితో తవ్వుతూ గుల్ల చేస్తున్నారు.గత చాలా రోజుల నుండి ఈ చెరువులో ఎర్రమట్టి,గరుసును అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.అక్రమ సంపాదనే ధ్యేయంగా ఈ ఎర్రమట్టి అక్రమ రవాణాకు తెరలేపినట్లు తెలుస్తోంది.ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులో అక్రమ ఎర్రమట్టి,గరుసు రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# తిరుపతిని గంజాయి వనంగా మారుస్తున్న వైసిపి ప్రభుత్వం

**- నోరు మెదపని దేవాదాయ శాఖ మంత్రి**

**- టిడిపి మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ,సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, దేవేంద్రప్ప**



**ఆదోని రూరల్,మార్చి 27,ప్రభాతవార్త :** శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువైన పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో తరచూ గంజాయి పట్టుబడుతున్నా టిటిడి ఉన్నతాధికారులు నోరు మెదపడం లేదని,వైసిపి ప్రభుత్వం తిరుపతిని గంజాయి వనంగా మారుస్తుందని టిడిపి మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ,సీనియర్ నాయకులు,మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్లు భాస్కర్‌రెడ్డి,దేవేంద్రప్ప,పట్టణ ముస్లిం మైనార్టీ నాయకుడు సాదీ రవూఫ్‌లు ఆరోపించారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి కొండకు వచ్చే భవన నిర్మాణ కార్మికులు,పారిశుద్ధ్య పనులు చేసే కూలీలు కొద్దిరోజులుగా గంజాయి మత్తులో ఉండటం..తిరుపతి నిఘా వర్గాలు నిద్రపోతున్నారా..తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లడంతో పాటు భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోందన్నారు. శ్రీవారి దర్శనార్థం నిత్యం వేలాది మంది వచ్చే తిరుమల పవిత్రతను దృష్టిలో పెట్టుకుని టిటిడి కొన్నేళ్ల కిందటే మద్యం,మాంసం,సిగరెట్,గుట్కా ఇతర పొగాకు ఉత్పత్తులను నిషేధించిందన్నారు. వాటితో తిరుమలకు రానీయకుండ అలిపి రిలోనే తనిఖీ చేసేలా చర్యలు తీసుకోవాలని అయితే ఎన్ని రకాల తనిఖీలు చేపడుతున్నప్పటికీ నిషేధిత ఉత్పత్తులు తరచూ కొండపై కనిపిస్తూనే ఉన్నాయ న్నారు. తాజాగా గంజాయి కూడా తిరుమలకు రావడం చర్చనీయాంశంగా మారిందన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 24న తిరుమల జీఎన్సీ టోల్‌గేట్ వద్ద ఓ కూరగాయల వాహనంలో 200గ్రాముల గంజాయిని ఎస్‌ఈబి,విజిలెన్స్ గుర్తించిందన్నారు. ఆ వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారన్నారు. ఈ ఘటన మరువక ముందే శుక్రవారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని లగేజీ కౌంటర్‌లో పనిచేసే మరో వ్యక్తి వద్ద నుంచి 150గ్రాముల గంజాయి ప్యాకెట్లను భద్రతా,టిటిడి అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటివి చోటు చేసుకుంటున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో రోజురోజుకు గంజాయి బూతం విస్తరిస్తోందనడానికి ఇదో సాక్ష్యమన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రంలో ఇలాంటి పరిస్థితి అత్యంత ఆవేదన కలిగిస్తోందన్నారు. సోషల్ మీడియాలోనూ టిటిడి,ప్రభుత్వంపై భక్తులు మండిపడుతున్నారన్నారు. అసలు తిరుమలలో ఏం జరుగుతోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు పటిష్ట నిఘా పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ మాజీ చైర్మన్ ఫకృద్దీన్, వడ్డేమాన్ గోపాల్,మాజీ ఎంపిపి మురళి,బిటి శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున,ఎండి హుస్సేన్ మల్లేష్,రాముడు,టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# అక్క చెల్లెమ్మలకు అండగా జగనన్న - ఎమ్మెల్యే



**వెలుగోడు,మార్చి 27,ప్రభాతవార్త:** మాట తప్పకుండా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రతి అక్క చెళ్ళమ్మలకు అండగా ఉంటూ వారి మొహాల్లో చిరునవ్వులు నింపాలనే ఒక ధ్యేయంతో వై.యస్.ఆర్.ఆసరా మూడవ విడతగా వారి ఖాతాల్లో రూ.6,419.89 కోట్లు విడుదల చేశారని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన మూడవ విడత ఆసరా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని చెక్కులను అందజేశారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతు మూడవ విడతగా 7,98,395 స్వయం సహాయక పొదుపు సంఘాల్లోని 78,94,169 మంది ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న వివిధ సంక్షేమ పథకాలు వైయస్సార్ ఆసరా సున్నావడ్డీ, చేయూత, పెన్షన్ కానుక ఇలా ఎన్నో పథకాల ద్వారా మహిళల కోసం నిరంతరం కృషి చేస్తున్నందున మహిళలు మాకు గౌరవం దక్కిందని మహిళలు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల జైపాల్, ఎం.పి.పి.లాలం రమేష్, వైకాపా మండల నాయకులు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఇలియాస్‌ఖాన్, దేశం తిరుపంరెడ్డి, ఎం.పి.టి.నసురుద్దీన్, సింగిల్ విండో అధ్యక్షులు వం గాల నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల పరిధి లోని రేగడగూడూరు గ్రామానికి చెందిన కట్టుబడి జైబున్నిషాకు మంజూ రు అయిన రూ.60 వేల సి.యం.రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్దిదారుకి అందజేశారు.

# మహిళలు మహారాణులుగా రాణించాలంటే జగనన్నే మళ్లి ముఖ్యమంత్రిగా ఉండాలి : పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి



**వెల్దుర్తి,మార్చి27,ప్రభాతవార్త :** రాష్ట్రంలోని అన్నివర్గాల మహిళలు మహారాణులుగా రాణించాలంటే జగనన్నే మళ్లి ముఖ్యమంత్రిగా ఉండాలని అందుకు మీ అందరి సహకారం కావాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి అన్నారు.మండల కేంద్రమైన వెల్దుర్తి ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో సోమవారం వైకెపి ఏపిఎం చంద్రశేఖర్ అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా 3వ విడత కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీదేవికి డిఆర్‌డిఏ పిడి వెంకటసుబ్బయ్య,ఏపిఎం చంద్రశేఖర్ గ్రామైఖ్య,పొదుపుసంఘాల మహిళలు సాదరంగా ఆహ్వానించారు.ఎమ్మెల్యే శ్రీదేవి,ఎంపిపి బొమ్మనసరళారవిరెడ్డి,ప్రజాప్రతినిధులు,అధికారులతో కలిసి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమయ్యింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి చేతుల మీదుగా వైఎస్సార్ ఆసరా 3వ విడత కింద రూ.4కోట్ల 96 లక్షల56వేల రుపాయల చెక్కును ప్రజాప్రతినిధులు,అధికారులు,పొదుపులక్ష్మీ మహిళలతో కలిసి ఆవిష్కరించారు.అనంతరం పొదుపులక్ష్మీ మహిళలు ఎమ్మెల్యే శ్రీదేవికి శాలువ,పూలమాలలతో సత్కరించారు.ఏపిఎం చంద్రశేఖర్ ఎమ్మెల్యే శ్రీదేవికి మొక్కను అందించారు.అదేవిధంగా సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే వారితో కలిసి పాలాభిషేకం చేశారు.అనంతరం ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ ఒక వెల్దుర్తి మండలంలోనే 847 పొదుపుసంఘాలకు 8561 మంది లబ్ధిదారులకు రూ.4కోట్లకు పైగా అక్కచెల్లెమ్మలకు ఇచ్చారన్నారు.మహిళలకు ఏమి చేశారని ప్రతిపక్ష తెదేపాను ఆమె ప్రశ్నించారు.జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక వెల్దుర్తిలో రూ.3కోట్లకు పైగా ఖర్చుపెట్టి త్రాగునీరు అందించామన్నారు.నాడు-నేడుతో పాఠశాలలకు కోట్లాది రుపాయలు ఖర్చుపెట్టి విద్య విప్లవం తీసుకువచ్చిన విప్లవవీరుడు జగనన్న అన్నారు.వెల్దుర్తి సామాజిక ఆరోగ్యకేంద్రంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం కోసం రూ..5కోట్లతో 30 పడకల ఆసుపత్రిని నిర్మించామని త్వరలోనే ప్రారం భిస్తున్నామన్నారు.మాట తప్పని మడమ తిప్పని నేత జగనన్న అన్నారు.వై ఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా ఆరోగ్యశ్రీ కింద ఎన్నో రోగాలకు కార్పొరేట్ వైద్యంతో శస్త్రచికిత్సలు అందించారన్నారు.ఆరోగ్యశ్రీ పథకం మన రాష్ట్రంలోనే కాక పక్కరాష్ట్రంలోను అమలు అవుతుందన్నారు.కరోనాలాంటి కష్టకాలంలో ఏ పథకాన్ని ఆపకుండా అమలు చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఈరోజు జగనన్న ప్రభత్వంలో అమలు చేస్తున్న ప్రతి పథకం వారి చెంతకే వస్తు న్నాయని నాడు తెదేపా ప్రభుత్వంలో ఒక చిన్న పథకం రావాలంటే ఎన్నికష్టా లు పడ్డారో మీరే గ్రహించాలన్నారు.నేడు రాజకీయపరంగా మహిళలకు అగ్రస్థా నం కల్పించిన వైకాపా ప్రభుత్వంను మరువరాదన్నారు. మండల ప్రజలందరికి ఎమ్మెల్యే శ్రీదేవి ముందస్తుగా శ్రీరామనవమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిపి బొమ్మన సరళారవిరెడ్డి, సర్పంచ్ శైలజ,డిఆర్‌డిఏ పిడి వెంకట సుబ్బయ్య,తహశీల్దార్ రాజేశ్వరి,ఎంపిడిఓ శ్రీనివాసరావు,వైకెపి ఏపిఎం చంద్రశేఖర్,ప్రజాప్రతినిధులు,అధికారులు,వైకాపా నాయకులు,కార్యకర్తలు,వెలు గు సిసిలు,సిబ్బంది,పొదుపుసంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సహకార బ్యాంకులతోనే ప్రజలకు మేలు

**-రైతులకే కాకుండా పొదుపు సంఘాలకు సహకారం**



పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

**నంద్యాల క్రైం, మార్చి 27, ప్రభాతవార్త:** సహకార బ్యాంకుల ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని రైతులకే కాకుండా మహిళా పొదు పు సంఘాలకు, చిన్న చిన్న వ్యాపారులకు, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసుకోవడానికి తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎంఎల్‌సి ఇసాక్‌బాష, కెడిసిసి బ్యాంకు చైర్మన్ మల్లెల ఝాన్సీ పేర్కొన్నారు. సోమవారం నంద్యాల బీమవరం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆర్థికసాయంతో నూతనంగ ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును వారు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ సహకార బ్యాంకులు ద్వారా అందించే వివిధ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తద్వారా అభివృద్ది పథంలో నడవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.అనంతరం యాళ్ళూరు గ్రామంలో రైతులకు కమ్యూనిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత విజయపాలడైరీ, సహకార బ్యాంకులు లాభాల బాటలో నడుస్తున్నాయని ఇది ఎంతో శుభపరిణామమన్నారు. భవిష్యత్తులో ప్రజలకు సహకార బ్యాంకులు చేయూత అందిస్తు కృషిచే యాలని కోరారు. పోలూరు సహకార బ్యాంకు పరిధిలో 21 గ్రామాలో వ్యాపారాలు సాగిస్తున్నాయని తెలిపారు. సహకార సంఘం నందు 3328 మంది సభ్యులతో వాటధనం రూ.170.50 లక్షలు కలిగి 1122 మందికి రుణాలు అందించడం జరిగిందన్నారు. 2005 నుంచి మిట్నాల, భీమవరం, చాపిరేవుల సంఘాలను పోలూరు సంఘంలో విలీనం చేయడం జరిగిందన్నారు. పోలూరు కార్యాలయం, గోదాము, పాండురం గాపురంలో 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్ ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా మందులు పంపిణి చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, నంద్యాల ఎంపీపీ శెట్టి ప్రభాకర్, భీమవరం వైసీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్, బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# హోంగార్డు కుటుంబాలకు ఎస్పీ ఆర్థికసాయం



**నంద్యాల క్రైం, మార్చి 27, ప్రభాతవార్త:** విధి నిర్వహణలో డోన్, నంద్యాల యూనిట్‌లో పనిచేస్తు మరణించిన ఏ మనోహార్‌రెడ్డి, వి రమేష్ కుటుంబ సభ్యులకు ఎస్పీ ఆర్థికసాయం అందించారు. కుటుంబ సభ్యుల ఆర్థికంగా ఇబ్బం దులు పడడంతో ఇరువురి కుటుంబాలకు రూ.10 వేలు, ప్రదీప్ కుటుంబానికి రూ.15 వేల రూపాయల చెక్కులను జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమణ చేతుల మీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టరు సుధాకర్‌లు ఉన్నారు.

# ఆటో డీ.. చిన్నారి మృతి



**ఆత్మకూరు,మార్చి27,ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలో 16 వార్డు గరీబ్‌నగర్ కాలనికి చెందిన చిన్నారిని ఆటో ఢీకొట్టగా అక్క డికక్కడె చిన్నారి మృతి చెందడం జరిగింది. ఆత్మకూరు పట్టణంలో రోజు రోజుకు చెలరేగి పోతు వచ్చిరాని డ్రైయింగ్ తో ఆటో డ్రైవర్ లు,అదే విదంగా గల్లీలలో భైకులపై అతివేగంగా పోపే పోరికు లు చెలరేగిపోతూ ప్రజల ను భయభ్రాంతులకు గురిచేస్తు ప్రజలు బిక్కమని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్లపై వెలుతున్న దృష్యం కనబడుతున్నా కాని అదికారులు పట్టిచ్చుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

# సహకార సంఘాల అభివృద్ధికి సహకరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పోచా

**నంద్యాల టెక్కె, మార్చి 27, ప్రభాతవార్త:** సహకార సంఘాల అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తామని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గోస్పాడు మండలంలోని యాళ్లూరు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సహకారంతో నిర్మించిన కమ్యూనిటి హాలు, టెంట్‌హౌస్‌ను ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి అధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ నాబార్డు ద్వారా అందించే రుణ సదుపాయాలను సహకార బ్యాంకుల ద్వారా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అప్కాబ్ సౌజన్యంతో త్వరలో సంఘానికి వేబ్రిడ్జి, పెట్రోల్ బంకులను మంజూరు చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏపీ అప్కాబ్ చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, కర్నూలు జిల్లా అప్కాబ్ బ్యాంకు చైర్మన్ ఎస్ మహాలక్ష్మీ, సిఇఓ రామాంజనేయులు, కెడిసిసి బ్యాంకు మేనేజరు శివలీలా, నంద్యాల జిల్లా సహకార శాఖాధికారి ఈ విజయ్ కుమారి, ఐసిడిపి ప్రాజెక్టు అధికారి వెంకటకృష్ణ, అప్కాబ్ డిజిఎం విజయ్‌కుమార్, భరద్వాజ శర్మ, ఎస్ ఎన్ మహబూబ్‌బాష, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ గాయత్రిదేవి,శ్రీ దక్షిణమూర్తి స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం

**- రవ్వలకొండ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తా - ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి**



**బనగానపల్లె,మార్చి27,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణ శివార్లలో గల రవ్వలకొండ ప్రాంతంలో పోతులూరి వీరబ్రహ్మం ద్రస్వామి వారు కాలజ్ఞానం గ్రంధాన్ని రచించడంతో ఈ రవ్వలకొండ ప్రాంతం ఎంతో మహిమాన్వితంగా విరాజిల్లడంతోపాటు కొండ గుహల ప్రాంతాన్ని ప్రతిరోజు పెద్ద సంఖ్యలో భక్తులు ఇక్కడికి వచ్చి సందర్శించడం జరుగుతుందని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు.సోమవారం శ్రీ వీరప్పయ్య స్వామి వారి ఆనందాశ్రమంలో నూతనంగా నిర్మించిన శ్రీ గాయత్రిదేవి,శ్రీ దాక్షాయిని మూర్తిస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి,అవుకు మండల వైసీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆనందా శ్రమంలో ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనడం తనకు చాలా ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.అదే విధంగా ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి,కాటసాని తిరుపాల్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.తదనంతరం శ్రీ వీరప్పయ్యస్వామి ఆనందా శ్రమం పీఠాధిపతులు శ్రీజ్ఞానేశ్వరానందస్వామి వారు,శ్రీ జ్ఞానేశ్వరిమాత దేవి వారు మరియు వివిధ ప్రాంతాల నుంచి వచ్చినటువంటి స్వాములు వేదమంత్రాల సాక్షిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి,కాటసాని తిరుపాల్‌రెడ్డిలకు దివ్య ఆశీర్వచ నాలు అందించారు.ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షులు, న్యాయవాది మాధవరెడ్డి,శ్రీ శైవక్షేత్రం పీఠాధిపతి శ్రీ బ్రహ్మంచారి శివస్వామి,శ్రీ బ్రహ్మపథం పీఠాధిపతి కృష్ణమాచార్యులు,సత్యజ్ఞాన రుషికుటీరం పీఠాధిపతి ప్రేణవానంద భారతిస్వాములు,శ్రీ రుద్రయోగేశ్వరస్వామి,శ్రీ పాండురంగనందా భారతిస్వామి,రాధపీఠం మాతాజీ రాధ ప్రియానందా, విశ్వహిందూపరిషత్ ధర్మప్రచారక్ ప్రముఖులు శ్రీ స్వాత్మానందస్వామి,శ్రీ బాబాపాండురంగ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండిజిల్లా

**- కలెక్టర్ పి. కోటేశ్వర రావు**



**కర్నూలు, మార్చి 27, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పా టు చేసిన స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యల ను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వర రావు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని సునయన ఆడిటోరి యంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మానికి జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ రామ సుందర్ రెడ్డి, డిఆర్వో నాగేశ్వర రావు తదితరులు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల నుండి స్వీకరించిన ఫిర్యాదులను పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులకు పంపారు.ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల, డివిజన్ స్థాయి అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్క రించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్‌ఎల్‌ఏ, రీఓపెన్.. కాకుండా అర్జీదారు డు సంతృప్తి చెందేలా అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ అధికారుల ను ఆదేశించారు. జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు స్పందన కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని సిఎంఓ స్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నారన్న విషయం గమనించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు..

# తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తున్న వారిని అరికట్టలేని సిఎం



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సోమిశెట్టి తదితరులు

**కర్నూలు న్యూసిటి, మార్చి 27, ప్రభాతవార్త:** భారతదేశంలోనే కాక యావత్ ప్రపంచంలోనే పేరెన్నికగల తిరుమల తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం. ధుమపానమే లేని అలాంటి ప్రాంతంలో గంజాయి పట్టుబడింది. దీనిపై నైతిక బాధ్యత వహించి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డిలు తమ పదవులకు రాజీనామా చేయాలని కర్నూలు పార్లమెంటు టిడిపి అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. తిరుమలలో గంజాయి పట్టుబడిన సంఘటనను నిరసిస్తు పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి స్థానిక విశ్వేశ్వరయ్య సర్కిల్ నందు ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సోమిశెట్టి, అకేపోగు ప్రభాకర్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత తిరుమల పవిత్రకు ఒక్కొక్కసారి ఒకరకంగా భంగం వాటిల్లడం జరిగిందన్నారు. గంజాయి పట్టుబడడం చుస్తుంటే ముఖ్యమంత్రి ప్రోద్బలంతోనే ఇలా జరుగుతుందనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. టిటిడి చైర్మన్ గానీ, ఈఓ ధర్మారెడ్డి గానీ ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. అలిపిరి దగ్గర విధి నిర్వహణలో ఉన్న అధికారులు ఎంతో పవిత్రంగా స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు నిబంధనల పేరుతో నానా ఇబ్బందులకు గురిచేసి వారిని సోదాలు చేసి పంపుతారు. మరి గంజాయి తిరుమలకు తీసుకొని వెళ్తుంటే ఎందకు ఉపేక్షించారని పోలీసు అధికారులు, విజిలెన్స్ అధికారులు ఎందు జోక్యం చేసుకోలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సోమిశెట్టి నవీన్, మహేష్‌గౌడ్, సంజీవలక్ష్మి, పరమేష్, యస్ అబ్బాస్, ఆదాము, హనుమంతరావుచౌదరి, చంద్రకాంత్, మారెన్న, గున్నా మార్కు, చంద్రకళాబాయి, అఖిల్,రాజ్యలక్షీ , నాగరాజుయాదవ్, బాబురావు, సాయినందన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల పరిష్కారాలపై నిర్లక్ష్యం చూపొద్దు..

**- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్**



**ఆదోని రూరల్,మార్చి 27,ప్రభాతవార్త :** ప్రజాసమస్యల పరిష్కారాలపై నిర్లక్ష్యం చూపొద్దని..సోమవారం వచ్చిన అర్జీలను శనివారం లోపు పరిష్కారం అయ్యేటట్టు చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం నందు స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాల న్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లకుండ చూడాల న్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండ ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి గోవింద్ సింగ్,డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్‌సర్వేయర్ వేణు సూర్య,మున్సిపల్ మేనే జర్ విజయభాస్కర్‌రెడ్డి,సీనియర్ సహాయకులు రామయ్య పాల్గొన్నారు.

# చిరుధాన్యాల వాడకాన్ని ప్రోత్సహించండి

**- జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు**




**కర్నూలు, మార్చి 27, ప్రభాతవార్త :** చిరు ధాన్యాలలో ఉన్నటువంటి పోషకాహర విలువలతో మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ఐసిడిఎస్ ఇంచార్జ్ పిడి ఉమామహేశ్వరి అధ్యక్షతన పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన చిరు ధాన్యాల పోషకాహర వంటకాల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు గారు తిలకించి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో చిరుధాన్యాల వాడకాన్ని ప్రోత్సహించాలని,చిరు ధాన్యాలలో ఉన్నటువంటి పోషకాహర విలువలతో మెరుగైన ఆరోగ్యం పొందవచ్చు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మానవ జీవన ప్రమాణాల స్థాయిని పెంచాలనే ఉద్దేశ్యంతో చేపట్టిన చిరు దాన్యాల పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించాలని, ప్రతి మండలంలో చిరుధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహించాలి అని జిల్లా కలెక్టర్ అన్నారు. ఐక్యరాజ్య సమితి 2022 -23 ఆర్థిక సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుదాన్యాల సంవత్సరం గా ప్రకటించిందని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో మార్చి నెల 20 తారీకు నుండి ఏప్రిల్ 3 వ తారీకు వరకు చిరు దాన్యాల ప్రాధాన్యతను అవగాహన కల్పించడం మరియు ప్రోత్సహించడంలో భాగంగా నేడు మన జిల్లా కేంద్రంలో చిరుధాన్యాలు వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేసుకోవడం జరిగిందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపివోలు, కోఆర్డినేటర్లు, అంగన్వాడి సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.